ప్రజాశక్తి

బుధవారం 15 అక్టోబర్ 2025 8 పేజీలు



గుంటూరు



పల్నాడు



ఎంటిఎంసిలో పేదలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ - మంత్రి నారా లోకేష్ ఎన్నికలకు ముందు వేసిన శిలాఫలకం ప్లకార్డుల ప్రదర్శనతో రెండోరోజు నిరసన

5లో

సిసిఐ ద్వారా పత్తి కొనుగోలుకు ఏర్పాట్లు

గుంటూరు కలెక్టర్ తమీమ్ అన్సారియా - పత్తిమిల్లులో ఏర్పాట్లపై పరిశీలన - పొలాల్లో రైతులతో మాటామంతి

ప్రజాశక్తి-గుంటూరు

రైతులకు ఇబ్బంది లేకుండా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిపిఐ) ద్వారా పత్తి కొనుగోలుకు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా తెలిపారు. వట్టిచెరుకూరు మండలం కుర్నూతల గ్రామంలో సిసిఐ పత్తి కొనుగోలుకు నోటిఫై చేసిన గాయత్రి కాటన్ ప్రెస్సింగ్ మిల్లు వద్ద పత్తి కొనుగోలు సన్నద్ధత ఏర్పాట్లను కలెక్టర్ మంగళవారం పరిశీలించారు.



గాయత్రి మిల్లులో దూదిని పరిశీలిస్తున్న కలెక్టర్

మిల్లు సమీపంలో సాగులో ఉన్న పత్తి పంటను, పరిశీలించి, పంట పరిస్థితిని, సాగు ఖర్చులు, దిగుబడి తదితర వివరాలను రైతుల ద్వారా తెలుసుకున్నారు. పత్తిపంట సాగు వివరాలను రైతులు కలెక్టర్‌కు తెలియజేస్తూ రెండు, మూడు వారాల్లో పత్తి మొదటి కోతకు సిద్ధమవుతుందని, దిగుబడినిబట్టి మూడు నాలుగు కోతలు తీసుకునే అవకాశం ఉంటుందని 2లో



విద్యార్థులతో మాట్లాడుతున్న కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆంధ్ర మాల్యాద్రి, ఇతర నాయకులు

దోమలతో అల్లాడుతున్న హాస్టల్ పిల్లలు

- బస్సు కోసం ఏడాది క్రితం విన్నవించినా స్పందించని వైనం
- అందని కాస్మొటిక్ ఛార్జీలు - మరుగుదొడ్ల కొరత
- తాడికొండ బీసీ హాస్టల్‌లో ప్రజాసంఘాల పరిశీలన

ప్రజాశక్తి - తాడికొండ

బీసీ సంక్షేమ హాస్టల్‌లో విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కుల వివక్ష పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర కార్యదర్శి ఆంధ్ర మాల్యాద్రి డిమాండ్ చేశారు. నియోజకవర్గ కేంద్రమైన తాడికొండలోని బీసీ హాస్టల్‌ను ప్రజాసంఘాలు మంగళవారం పరిశీలించాయి. విద్యార్థులతో నాయకులు మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ హాస్టల్‌కు చెందిన విద్యార్థులు డిగ్రీ, ఇంటర్మీడియట్, బీటెక్ చదవడానికి గుంటూరు, లాం, మోతడక ప్రాంతాలకు బస్సులో వెళ్తున్నారని, కాలేజీ వేళల్లో బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. 2లో

ఒకసారి దేహశుద్ధి చేసినా మారని బుద్ధి

విద్యార్థినుల పట్ల ఉపాధ్యాయుని మరోసారి అసభ్య ప్రవర్తన

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించాడని ఉపాధ్యాయునికి విద్యార్థుల తల్లిదండ్రులతోపాటు గ్రామస్తులు దేహశుద్ధి చేశారు. మండలంలోని ఫణిదం జెడ్‌పి పాఠశాలలో జువాలజీ ఉపాధ్యాయుడు తమ పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని విద్యార్థినులు తమ తల్లిదండ్రులకు చెప్పడంతో గ్రామస్తులు మంగళవారం పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేశారు. ఏడాది క్రితం ఇదే ఉపాధ్యాయుడు అప్పట్లో తాను పనిచేసిన చోట కూడా ఇదే రీతిలో ప్రవర్తించటంతో అక్కడ కూడా దేహశుద్ధి చేశారు. ప్రస్తుతం ఆయన గ్రామ నాయకులు సమక్షంలో క్షమాపణ చెప్పడంతో రాజీ కుదిరినట్లు సమాచారం. అయితే పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారికి, సత్తెనపల్లి డివిజన్ ఉపవిద్యా శాఖ అధికారి ఏసుబాబు కొందరు ఫిర్యాదు చేయగా పాఠశాలను ఉపవిద్యాశాఖ అధికారి సందర్శించి వివరాలు సేకరించారు. ఇంకెప్పుడూ ఇలా చేయనని సదరు ఉపాధ్యాయుడు లేఖ రాసిచ్చినట్లు సమాచారం.

కమిషనర్ సంతకం ఫోర్జరీ - జిఎంసి సిబ్బంది సస్పెన్షన్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థ (జిఎంసి) కమిషనర్ సంతకం ఫోర్జరీ చేసి నకిలీ ఉద్యోగ నియామక పత్రం అందించిన రికార్డ్ అసిస్టెంట్ ఎస్.నాగేశ్వరరావును, ప్రజా ఫిర్యాదులు పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శి వై.త్యాగరాజును విధుల నుండి సస్పెండ్ చేశామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిషనర్ సంతకాన్ని జిఎంసి సర్కిల్ కార్యాలయంలో రికార్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నాగేశ్వరరావు ఫోర్జరీ చేసి, విజయవాడకు చెందిన జడ సుందరరావు అనే వ్యక్తి నుండి రూ.4.40 లక్షలు తీసుకొని, నకిలీ ఉద్యోగ నియామక పత్రం సృష్టించినట్లు పేర్కొన్నారు. సుందరరావు నేరుగా కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా, డిప్యూటీ కమిషనర్ చేసిన విచారణలో ఎస్.నాగేశ్వరరావు సంతకం ఫోర్జరీ చేసినట్లు నిర్ధారణైనట్లు తెలిపారు. ఎపిసిఎంఎంఎస్‌లో పారిశుధ్య సమస్యలపై 45 వార్డు సచివాలయం పరిధిలోని ప్రజలు చేసిన ఫిర్యాదు పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించటంతోపాటు, పరిష్కరించినట్లు వివరాలు నమోదు చేసినందుకు శానిటేషన్ సెక్రెటరి వై.త్యాగరాజును సస్పెండ్ చేశామని తెలిపారు.

అనధికార బాణసంచా నిల్వలు, విక్రయాలపై చర్యలు

దీపావళి నేపథ్యంలో అధికారులతో గుంటూరు, పల్నాడు కలెక్టర్ల సమీక్ష



సమీక్షిస్తున్న పల్నాడు కలెక్టర్ కృతిక శుక్లా

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా, గుంటూరు

దీపావళి తనేపథ్యంలో అనధికార బాణసంచా నిల్వలు, విక్రయాలు ఉండరాదని అధికారులను గుంటూరు, పల్నాడు కలెక్టర్లు ఎ.తమీమ్, అన్సారియా, కృతిక శుక్లా ఆదేశింకారు. బాణసంచా స్టాళ్ల అనుమతులు, భద్రతా చర్యలు, నిబంధనల పాటింపు తదితర అంశాలపై అధికారులతో మంగళవారం టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో పల్నాడు ఎస్పీ కృష్ణారావుతో కలిసి అధికారులతో పల్నాడు కలెక్టర్ సమీక్షించారు. బాణసంచా దుకాణదారులకు లైసెన్స్ ఇస్తామని, ధ్వని కాలుష్య నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రభుత్వ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా బాణసంచా దుకాణం నిర్వహించరాదని, నిబంధనలు మీరిన షాపులను సీజ్ చేయాలని చెప్పారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్టాళ్లలోనే టపాసులు కొనుగోలు చేయాలన్నారు. ఎక్కడ పడితే అక్కడ బహిరంగంగా బాణసంచా దుకాణాలు నిర్వహిస్తే విక్రయదారులపై కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. నిబంధనల మేరకు షాపులు ఏర్పాటు చేస్తున్నారా లేదా అని పరిశీలించాలన్నారు. స్టాళ్లను పరిశీలించి అనుమతులు ఉన్నవాటికి పర్మిషన్లు, పర్మిషన్ ముగిసిన స్టాళ్లకు రెన్యూవల్ చేయాలన్నారు. విద్యుత్, అగ్నిమాపక, పోలీసు, మున్సిపల్, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ షాపుల ముందు ఇసుక, నీటి బక్కెట్లు వంటి 2లో

నేటి నుండి విద్యుత్ ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి-గుంటూరు

విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగులు, జెఎల్‌ఎం గ్రేడ్-2ల సమస్యల పరిష్కారానికి నేటి నుండి నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ జిల్లా చైర్మన్ దాసరి వెంకటేశ్వర రావు పిలుపునిచ్చారు. పాతగుంటూరులోని సిఐటియు కార్యాలయంలో ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ జనరల్ బాడీ సమావేశం వి.రాంప్రభాకర్, జి.నాగరాజుల అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. సమావేశంలో స్ట్రగుల్ కమిటీ చైర్మన్ దాసరి వెంకటేశ్వరరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్ నాగబ్రహ్మాచారి, జిల్లా గౌరవాధ్యక్షులు బి.లక్ష్మణరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, జిల్లా నాయకులు సుబ్బారెడ్డి మాట్లాడారు. కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేసేవరకు,



అభివాదం చేస్తున్న నాయకులు

వన్ ఇండస్ట్రీ వన్ సర్వీస్ రెగ్యులేషన్స్ అమలు చేసి గ్రేడ్-2 కార్మికులకు న్యాయం చేసేవరకు, పాత పెన్షన్ విధానం పునరుద్ధరించే వరకు పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. కారుణ్య నియామకాల్లో జరుగుతున్న అన్యాయాన్ని నివారించాలని, నగదురహిత అపరిమిత మెడికల్ పాలసీని వర్తింపజేయాలని, కాంట్రాక్టు కార్మికులకు రూ.కోటి ఇన్సూరెన్స్ చేయాలని, నేరుగా వేతనాలు చెల్లించడం వల్ల విద్యుత్ సంస్థకు రూ.192 కోట్ల భారం తగ్గుతుందని, తద్వారా వేతనాల్లో వ్యత్యాసాన్ని నివారించవచ్చని, అరియర్స్ చెల్లించవచ్చని, పీసిరేట్ వర్కర్లైన, ఎస్‌పిఎం స్టోర్స్ హమాలీలకు, మీటర్ రీడర్లకు, పిసీఎలకు, ఎటిఎం, లాంటి అనేకమందికి ఉద్యోగ భద్రత, కనీస వేతనం చెల్లించవచ్చని వివరించారు. అర్హత కలిగిన ఉద్యోగులకు, జేఈ, జేఏ, కన్వర్షన్ ఇవ్వాలని ఒకవైపు ధరలు పెరుగుతున్నా పెండింగ్ డిఏలు విడుదల చేయకపోవడం అన్యాయమన్నారు. విద్యుత్ యాజమాన్యం, ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలు శాంతియుత వాతావరణంలో పరిష్కరించాలని, లేకుంటే సమ్మెకు సైతం సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. సమావేశంలో నాయకుల జానీ, పవన్, రాంబాబు, వంశీ, ఎ.రాజేష్, కొండా, చంద్రశేఖర్ ఆచారి పాల్గొన్నారు.



4 గేట్లు ద్వారా సాగర్ నీటి విడుదల

ప్రజాశక్తి - విజయపురిసౌత్



నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరదనీటి చేరిక కొనసాగుతుండటంతో మంగళ వారం ప్రాజెక్టు 4 క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. 4 గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 32,816 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 84,015 క్యూసెక్కులు వచ్చి చేరటంతో ఇక్కడ నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 84,045 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. కుడికాల్వకు 10,040, ఎడమ కాల్వకు 6,791, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 33,698, ఎస్‌ఎల్బీసీకి 1,200 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం సాగర్ జలాశయ నీటిమట్టం 589 అడుగుల వద్ద ఉంది. ఇది 311,4474 టీఎంసీలకు సమానం.



రూ.30 లక్షలతో సిసి రోడ్డు పనులు

ప్రజాశక్తి - వెల్దుర్తి

ఉపాధి హామీ నిధులు రూ.30 లక్షలతో మండలంలోని మండాది గ్రామంలో సిసి రోడ్డు పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో ఎంపిడిఒ ప్రసాద్‌రావు, ఎఇ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కుర్రి శివారెడ్డి, గుజ్జుల పాపిరెడ్డి, అంకిరెడ్డి పాల్గొన్నారు.

అనధికార బాణసంచా నిల్వలు, విక్రయాలపై చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

అగ్నిమాపక నిబంధనలను పాటించాలన్నారు. స్టాళ్ల ముందు ధరల పట్టిక బహిరంగంగా ప్రదర్శించాలన్నారు. సమీక్షలో ఆర్డీఓలు, జిల్లా చీఫ్ ఫైర్ ఆఫీసర్, మున్సిపల్ కమిషనర్లు, ఫైర్, రెవెన్యూ, పోలీసు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

గుంటూరు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బాణసంచా తయారీ, విక్రయాలు, నిల్వలు, రవాణా తదితర సందర్భాల్లో ఎక్కడా ఎటువంటి దుర్ఘటనలు, అవాంఛిత సంఘటనలు జరగకూడదని స్పష్టం చేశారు. అనధికార బాణసంచా తయారీ, విక్రయాలు, నిలువలు, రవాణా తదితర అంశాలపై స్పష్టమైన నిఘా, సమాచారం కలిగి ఉండాలని చెప్పారు. రెవెన్యూ, పోలీస్, విపత్తులు - అగ్నిమాపక శాఖ సంయుక్తంగా తనిఖీలు నిర్వహించాలన్నారు. అనధికార బాణసంచా తయారీ, విక్రయాలు, నిల్వలు, రవాణాను గుర్తిస్తే వాటిని సీజ్ చేయాలని ఆదేశించారు. 20వ తేదీన దీపావళి సందర్భంగా తాత్కాలిక షాపులు ఏర్పాటుకు అనువైన స్థలాలను గుర్తించాలని, దుకాణాల ఏర్పాటుకు 17వ తేదీ వరకు ధరఖాస్తులు సమర్పించాలని, అనుమతులు లేకుండా బాణాసంచాలు విక్రయించరాదని స్పష్టం చేశారు. అనుమతులు లేకుండా విక్రయిస్తున్న వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సిసిఐ ద్వారా పత్తి కొనుగోలుకు ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి)

చెప్పారు. ఇటీవల వర్షాల వల్ల పత్తి దిగుబడి కొంత తగ్గే అవకాశం ఉందని, ఎకరాకు సాగు ఖర్చులు రూ.50 వేల వరకు అవుతున్నాయని తెలిపారు. కోస్తాంధ్రాలో వాతావరణ పరిస్థితుల వల్ల తేమ శాతం ఎక్కువగా ఉంటుందని సీసీఐ పత్తి కొనుగోలుకు నిర్దేశించిన 6.5 శాతం తేమను 15 శాతానికి పెంచాలని కలెక్టర్‌ను రైతులు కోరారు. అనంతరం గాయత్రి కాటన్ ప్రెస్సింగ్ మిల్లులో జిన్నింగ్ మిషన్ల ద్వారా పత్తినుంచి దూదిని తీసే ప్రక్రియను, ప్రెస్సింగ్ యూనిట్ ద్వారా దూదిని బేళ్లుగా కట్టే విధానాన్ని కలెక్టర్ పరిశీలించారు. సీసీఐ ద్వారా ప్రత్తి కొనుగోలుకు సంబంధించి సన్నద్ధత ఏర్పాట్లు గురించి వ్యవసాయ శాఖ, మార్కెటింగ్ శాఖ, కాటన్ మిల్లుల నిర్వాహకులతో చర్చించి సూచనలు చేశారు. మిల్లుల నిర్వాహకులు మాట్లాడుతూ జిన్నింగ్ మిల్లులకు విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, తెలంగాణ నుంచి తీసుకువచ్చే పత్తికి మార్కెట్ సెస్ రాయితీ ఇవ్వాలని ప్రభుత్వానికి తెలియజేయాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎ.నాగేశ్వరరావు, వ్యవసాయ మార్కెటింగ్ ఏడీ సత్యనారాయణ చౌదరి, తహశీల్దార్ క్షమారాణి, వ్యవసాయ శాఖాధికార్లు పాల్గొన్నారు.



పొలంలో పత్తిని పరిశీలిస్తూ రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

దోమలతో అల్లాడుతున్న హాస్టల్ పిల్లలు

(మొదటి పేజీ తరువాయి)

తాడికొండలో బస్సులు ఆపడం లేదని గుంటూరు డిపోకు వెళ్లి విద్యార్థులు గత అక్టోబర్‌లో ఫిర్యాదు చేసినా ఇప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని అన్నారు. హాస్టల్ ప్రాంగణంలో దోమల అధికంగా ఉన్నాయని, ప్రభుత్వం అందించాల్సిన దుప్పట్లను ఇప్పటివరకు అందించలేదని విద్యార్థులు తమ దృష్టికి తెచ్చారని చెప్పారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కొంతమంది విద్యార్థులకు అందలేదని, దీనివలన కాలేజీ యాజమాన్యం విద్యార్థులపై తీవ్ర ఒత్తిడి తెస్తోందని తెలిపారు. హాస్టల్లో 50 మంది విద్యార్థులుండగా మూడు బాత్రూములే ఉన్నాయని, అవి అదనంగా మరికొన్ని నిర్మించాలని డిమాండ్ చేశారు. ఆహారం రుచికరంగా లేకపోవడం, సరిగ్గా ఉడకపోవడం వల్ల ఆరోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. దీనిపై వార్డెన్ సత్వరం చర్యలు తీసుకోవాలని కోరారు. వారానికి రెండుసార్లు అందిస్తున్న మాంసం 50 మందికి గాను ఐదు కిలోలు పెడుతున్నారని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి విద్యార్థికి 200 గ్రాములు అందించాలని, ఈ లెక్కన ఇప్పుడు అందులో సగమే అందుతోందని వివరించారు. విద్యార్థులకు అందించాల్సిన కాస్మోటిక్స్ ఛార్జీలు దాదాపు ఏడాది పైబడి అందడం లేదని విద్యార్థులు చెప్పారన్నారు. వీటితోపాటు దుప్పట్లు, దోమతెరలు వెంటనే అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమస్యలన్నింటినీ జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని విద్యార్థులకు నాయకులు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో కెవిపిఎస్, రైతుసంఘం జిల్లా కార్యదర్శులు జె.నవీన్‌ప్రకాష్, కె.అజయ్‌కుమార్, రైతుసంఘం మండల కార్యదర్శి సిహెచ్.భాస్కరరావు, సుదర్శన్ పాల్గొన్నారు.



మరుగుదొడ్లను పరిశీలిస్తున్న నాయకులు



జీవన ఎరువులు లాభదాయం

ప్రజాశక్తి - యడ్లపాడు

పత్తి పంటలో జీవన ఎరువులను వాడటం ద్వారా పంటకు కావలసిన పోషకాల లభ్యత మెండుగా ఉండి ఉత్తమ ఫలితాలను సాధించవచ్చునని ఏరువాక కేంద్రం కోఆర్డినే టర్ డాక్టర్ ఎమ్ నగేష్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పివి సత్యగోపాల్ పేర్కొన్నారు.జీవన ఎరువుల ప్రాముఖ్యతపై జరుగుతున్న వారోత్స వాలలో భాగంగా మంగళవారం యడ్లపాడు లోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన రైతు శిక్షణ కార్యక్రమంలో వారు పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో ఎంపిడివో వి హేమలతాదేవి,అభ్యుదయ రైతు పోపూరి శివరామకష్ణ రైతులు,గ్రామీణ అవగాహన కషి అనుభవ పథకం విద్యార్థినులు పాల్గొన్నారు.

విశాఖలో గూగుల్ ఏఐ హబ్ ఓ మైలురాయి

సిఎంను కలిసి శుభాకాంక్షలు తెలిపిన ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ

ప్రజాశక్తి - గుంటూరు

విశాఖపట్నంలో ఒక గిగావాట్ హైపర్ స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటు చేయడం శుభపరిణామమని, ఈ సెంటర్‌కు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గూగుల్ మధ్య జరిగిన చారిత్రక ఒప్పందం హర్షణీయమని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ అన్నారు. ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన గూగుల్ టెక్ సంస్థ విశాఖపట్నానికి తీసుకురావడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి లోకేష్ కృషి ప్రశంసనీయమన్నారు. ఈ మేరకు మంగళవారం సిఎం చంద్రబాబును మోహనకృష్ణ కలిసి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. సీఎం చంద్రబాబు నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మైక్రోసాఫ్ట్ వంటి దిగ్గజ సంస్థలని తీసుకువచ్చి హైదరాబాద్‌ని అభివృద్ధి చేశారని.. ఇప్పుడు విశాఖకు గూగుల్‌ని తీసుకువచ్చి ఆంధ్రప్రదేశ్ ముఖచిత్రాన్ని మార్చుతున్నారని అన్నారు. పరిశ్రమలకు అనుకూలమైన వాతావరణం, సమర్ధవంతమైన నాయకత్వం ఉండటంతో ఏపీకి గూగుల్, టీసీఎస్, ఆక్సెంచర్ వంటి టెక్ దిగ్గజాలు వస్తున్నాయని, సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ రాత్రింబవళ్లు కష్టపడుతూ వివిధ కంపెనీల ప్రతినిధులతో గంటల కొద్దీ చర్చలు జరిపి ఏపీకి పరిశ్రమలను తీసుకొస్తున్నారని కొనియాడారు. రాబోయే రోజుల్లో గ్లోబల్ కనెక్టివిటీ హబ్‌గా విశాఖ ఉండబోతుందని, విశాఖ నుంచి 12 దేశాలతో సబ్ సీ-కేబుల్ విధానం ద్వారా అనుసంధానం అవుతాయని చెప్పారు. అమెరికా వెలుపల గూగుల్ సంస్థ ఇంత పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టడం ఇదే తొలిసారని, ఈ డేటా సెంటర్ ద్వారా ప్రపంచ స్థాయి ఏఐ నిపుణులు తయారయ్యేందుకు అవకాశం ఉందన్నారు.



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 16 నెలల్లో ఏపీకి రూ.11.20 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు 9.5 లక్షల ఉద్యోగావకాశాలు కల్పించిందని, గూగుల్ కంపెనీ రాకతో యువతకు ప్రపంచస్థాయి అవకాశాలు అందుతాయని మన్నవ మోహనకృష్ణ విశ్వాసం వ్యక్తం చేశారు.

ఈశ్వర్ ఇంజినీరింగ్‌లో పిసిబి డిజైన్ - అర్డ్వినో రీసెర్చ్ వర్కుషాప్ ప్రారంభం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట మండలం కేసానుపల్లిలోని ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల బిటెక్ ద్వితీయ ఏడాది ఈసిఈ విద్యార్థులకు వర్క్‌షాప్ మంగళవారం ప్రారంభమైంది. విజయవాడ పిసిబి డిజైన్ - అర్డ్వినో అంశంపై పర్పుల్ టెక్నాలజీస్ సహకారంతో వారం రోజుల పాటు ఈ వర్క్‌షాప్‌ను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జి.నాగమల్లేశ్వరరావు తెలిపారు. రిసోర్స్ పర్సన్ పి.సుధాకర్ మాట్లాడుతూ నేటి సాంకేతికత పోటీ ప్రపంచంలో ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డ్ పిసిబి డిజైన్ ఎలక్ట్రానిక్ పరికరాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. స్మార్ట్‌ఫోన్, కంప్యూటర్, వైద్య పరికరం, ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డ్ పరికరాలకు వెన్నుముకగా ఉంటాయన్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్నందున తరుణంలో పరిశ్రమల్లో నైపుణ్యం కలిగిన పిసిబి డిజైనర్లకు డిమాండ్ ఉందని చెప్పారు. సృజనాత్మకతతో జరిగే రీసెర్చ్ వర్కు షాపులు వల్ల విద్యార్థులు ప్రాజెక్టు మోడల్ తయారు చేసి ఇంటెర్నెషిప్‌తో పాటు ఉద్యోగావకాశాలు



పొందవచ్చని కళాశాల సెక్రటరీ షేక్. కరీం మొహిద్దీన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ షేక్.మస్తాన్ షరీఫ్ వివరించారు. కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ షేక్ మీరావలి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షేక్ నజీమా, ఈసిఈ విభాగాధిపతి డాక్టర్ షేక్ బషీరా, అధ్యాపకులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంచుతున్న సిపిఎం నాయకులు

ఇళ్ల స్థలాల కోసం విరివిగా దరఖాస్తులు

ప్రజాశక్తి- తాడేపల్లి

సొంత ఇంటి జాగాలేని పేదల కోసం సిపిఎం నిర్వహిస్తున్న ఇంటి స్థలాల అర్జీల కోసం ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోంది. మంగళవారం తాడేపల్లి పట్టణంలోని సుందరయ్య నగర్ ప్రాంతాల్లో మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చిన మేరకు రెండు సెంట్ల ఇళ్ల స్థలం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఎం కార్యకర్తలు కరపత్రాలు పంచుతూ, బాధితులకు అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం కార్యదర్శి నారిన నాగేశ్వరరావు, బొబ్బిలి రామారావు, కొట్టి కరుణాకర్ రావు, ఎల్ సత్యం, ఎస్ కే బాష, నాని, లక్షణ, కొండబాబు పాల్గొన్నారు.

ఎకో ఫ్రెండ్లీ దీపావళిపై అవగాహన

ప్రజాశక్తి - మంగళగిరి

దీపావళి సందర్భంగా టపాకులు కాల్చడం వలన గాలి కాలుష్యం పెరిగి ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఈ నేపథ్యంలో గాలి కాలుష్యాన్ని తగ్గించేందుకు, పర్యావరణ హితమైన పండుగ జరుపుకునే అలవాటును పెంపొందించేందుకు మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో వివర్స్ కాలనీలో మంగళవారం మున్సిపల్ స్కూల్లో ఎకో ఫ్రెండ్లీ దీపావళి అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ ప్రజలు టపాకులతో కాకుండా పర్యావరణానికి హితమైన దీపాలతో దీపావళి జరుపుకోవాలని తెలియచేశారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ హనుమాన్, ప్రధానోపాధ్యాయులు ఏ వెంకటేశ్వర రావు, టీచర్ సుజాత, ఐఇసి డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ శంకర్, ఎన్విరాన్మెంటల్ సెక్రటరీలు మున్సి పల్ సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారి సొమ్ముపై వీడని అనుమానాలు

ప్రజాశక్తి - పెదకాకాని

ప్రముఖ శైవ క్షేత్రాలలో ఒకటైన పెదకాకానిలోని శ్రీ మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో భ్రమరాంబ అమ్మవారి నగకు సంబంధించిన 30 గ్రాముల బంగారం మాయం కావడం ఇటీవల చర్చనీయాంశమైంది. దీనికి సంబంధించి పలు అను మానాలకు తావిస్తున్నాయని దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని మంగళవారం వైసిపి మండల అధ్యక్షులు ఎం.మల్లికార్జున్ రెడ్డి విలేకరుల సమావేశంలో డిమాండ్ చేశారు. రెండునెలలుగా కనిపించని బంగారం వార్తాపత్రికలలో ప్రచురితం అవగానే రాత్రికి రాత్రిఎలా దొరుకుతుందని, దీనిపై భక్తులకు అనేక అనుమానాలున్నాయని అన్నారు. ఎంతో చరిత్ర కలిగిన దేవస్థానంలో ఇలాంటి సంఘటన జరగటం శోచనీయమన్నారు. టి.నాగేశ్వరరావు, పి.విజయబాబు, ఉదయశంకర్, ఏ.వెంకట్రావు, భాను, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

63 మంది ఆర్‌విఐటి విద్యార్థుల రక్తదానం

ప్రజాశక్తి - చేబ్రోలు

ఎదుటివారికి సహాయపడే మంచి ఆలోచనలను విద్యార్థి స్థాయిలో నుంచి అలవర్చుకోవాలని చేబ్రోలు ఆర్‌విఐటి కళాశాల ప్రిన్సిపల్ ఆర్.కృష్ణయ్య అన్నారు. ఆర్‌విఐటి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. శిబిరాన్ని ఆర్విఐటీ చేబ్రోలు ఎన్ ఎస్ ఎస్ యూనిట్, శ్రీ వెల్ఫేర్ బ్లడ్ బ్యాంక్ గుంటూరు సంయుక్తంగా నిర్వహించడం జరిగింది అన్నారు. 63 మంది విద్యార్థులు పాల్గొని రక్త దానం చేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.వి.కృష్ణయ్య, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.మల్లికార్జున పాల్గొని ప్రసంగిస్తూ ఆపదలో ఉన్న వారికి మనం చేసే రక్తదానం ఎంతో ఉపయోగపడుతుందనీ, వారి ప్రాణాలను నిలబెడుతుందని అన్నారు. ఇలాంటి సేవ కార్యక్రమాలలో విద్యార్థులు పాల్గొని ఎదుటి వారికి సహాయపడాలని సూచించారు.

నల్లబర్లీ పొగాకు సాగు నిషేదంపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి - ఫిరంగిపురం

నల్లబర్లి పొగాకు సాగుపై ఉన్న నిషేధాన్ని తెలియజేయడానికి అవగాహన సదస్సు ఫిరంగిపురం మండలంలోని తక్కెళ్ళపాడు గ్రామంలో నిర్వహించారు. సమావేశంలో ఫిరంగిపురం మండల తహశీల్దారు జె.ప్రసాద్‌రావు పోలీసుశాఖ సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు ఆరోగ్య శాఖ సిహెచ్‌ఓ వెంకటరమణ మండల వ్యవసాయాధికారి జె.వాసంతి పాల్గొన్నారు. వాసంతి మాట్లాడుతూ గతేడాది రైతులు సాగు చేసిన నల్లబర్లి పొగాకు కొనుగోలుకు ఇబ్బందులు ఏర్పడిందనీ, దీన్ని దృష్టిలో ఉంచుకున్న ప్రభుత్వం నల్లబర్లి పొగాకు క్రాప్‌హాలిడే ప్రకటించిందని అందువల్ల రైతులందరూ ఈ పొగాకుని సాగు చేయరాదని తెలిపారు. సాగు చేసిన ఎడల ప్రభుత్వ యంత్రాంగం ద్వారా దానిని దున్నిస్తామని హెచ్చరించినారు. ఎవరైనా సాగు చేస్తే ఆ పంటను ఈ పంట నమోదు చేయమనీ, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రభుత్వానికి సంబంధం ఉండదని బలవంతంగా ఎవరైనా సాగు చేస్తే సాగును దున్నిస్తామని తెలిపారు. ఈ కార్య



క్రమంలో పాల్గొన్న మండల తహశీల్దార్ జె.ప్రసాద్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఈ కమిటీ తప్ప కుండా అమలు చేస్తుందని అందువల్ల రైతులెవ్వరు నల్లబర్లి సాగు చేయరాదని అటువంటి హెచ్చరికలను ఖాతరు చేయకుండా సాగు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపినారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి షేక్ సుభాని, గ్రామ వ్యవసాయ సహాయకులు బెల్లంకొండ హకీం పాల్గొన్నారు. రైతులు వారి సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

ఉపాధి కల్పనకు టెక్ పార్క్ ఏర్పాటు

ప్రజాశక్తి - దుగ్గిరాల

మహిళలకు ఉపాధి కల్పనలో భాగంగా టెక్ పార్క్ ఏర్పాటు చేస్తున్నట్లు పంచాయతీరాజ్ నేషనల్ రిసోర్స్ పర్సన్ నీలేంద్ర ముఖర్జీ అన్నారు. తాడికొండ మండలం మోతడక గ్రామంలో రూ.22 కోట్లతో ఏర్పాటు చేస్తున్న టెక్ పార్క్(పచ్చళ్ల తయారీ కేంద్రం)కు సంబంధించి విధి విధానాలు తెలుసుకునే కార్యక్రమం లో మూడు రోజుల పర్యటనలో భాగంగా మంగళ వారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని పచ్చళ్ళ తయారు చేసే మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పచ్చళ్ళు తయారీ, మార్కెటింగ్ సంబంధించి వారు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రాజశ్రీ ప్రొడక్ట్స్ ఎగ్జిక్యూటివ్ జేపీ మూర్తి డిఆర్‌డిఏ అడిషనల్



మహిళలతో మాట్లాడుతున్న అధికారులు

ప్రొడక్ట్ డైరెక్టర్ కిరణ్ కుమార్ లవ్లీ హుడ్ డిపిఎం అశోక్ కుమార్ ఏపిఎం జి సురేష్ కుమార్ స్టేట్ బ్యాంక్ మేనేజర్ గోపి వివిధ మండలాలకు సంబంధించిన ఏ పి ఎం లు మరియు డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

17న ధర్నాకు తరలిరండి

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఈనెల 17వ తేదీన సిపిఎం ఆధ్వర్యంలో ఇళ్ల పట్టాలు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జరిగే ధర్నా కార్యక్రమానికి పేదల పెద్ద సంఖ్యలో తరలిరావాలని సిపిఎం పట్టణ కార్యదర్శి వివి జవహర్లాల్ అన్నారు. మంగళవారం మంగళగిరి పట్టణంలోని ఒకటవ వార్డ్ లోని ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తులు పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేస్తున్నారు. ఇళ్ల స్థలాలు కోసం పేదలు పెద్ద ఎత్తున తరలివస్తానికి ఉత్సాహంగా ఉన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎస్ ఎస్సి చెంగయ్య , సిపిఎం సీనియర్ నాయకులు పి బాలకష్ణ, సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బాలాజీ, స్థానిక నాయకులు కే శ్రీనివాసరావు, మీరాబాయి, కే సాయి, ఏ రామారావు, ఎం రామారావు, ఎం సుబ్బారావు, కే.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

జస్టిస్ బిఆర్ గవాయిపై దాడి అనాగరికం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బి.ఆర్ గవాయిపైన దాడి అనాగరికమైన చర్య అని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మున్నంగి నాగరాజు మాదిగ ఆరోపిం చారు. ఈ దాడిని ఖండిస్తూ దేశ ప్రధాని స్పందించిన తీరును పూర్తిగా స్వాగతిస్తున్నామన్నారు. మంగళవారం ప్రత్తిపాడు మండల కేంద్రంలో డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయి దళితుడు కావడం వల్లే ఈ దాడి జరిగిందని పేర్కొన్నారు. రాజ్యాంగం వల్లనే ఈ దేశంలోని దళిత వర్గాలు స్వేచ్ఛ, స్వాతంత్రం, గౌరవం గుర్తింపును సంపాదించుకున్నాయని పేర్కొన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లనే మనుషులుగా గుర్తించబడ్డామని తెలిపారు. ఢిల్లీ పోలీసులు స్పందించి చట్టపరంగా కేసులు నమోదు చేసి నిందితులను శిక్షించాలన్నారు. నిందితుడు బూటు విసిరి వేయడాన్ని తేలికగా తీసుకోవద్దని, బూటు కాకుండా అతని చేతిలో మరేదైనా మారణాయుధం ఉంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉండేదో అర్థం చేసుకోవచ్చన్నారు. పత్రికల్లో వచ్చిన వార్తలను, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రసారమైన కథనాలు చూసి సుమోటోగా న్యాయస్థానాలు, పోలీసు వ్యవస్థ కేసులు నమోదు చేస్తున్నాయనీ, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేస్తూ జాతీయస్థాయిలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఉద్యమం చేపడుతున్నట్లు ప్రకటించారు. అందులో భాగంగా ఈనెల 13న కలెక్టర్ కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించామన్నారు. 17న అన్ని మండల కేంద్రాల్లో నల్లజెండాలతో నిరసన ప్రదర్శనలు, 22న చలో హైదరాబాద్ పేరుతో తెలంగాణ రాష్ట్రంలో, 23న చలో అమరావతి ఆంధ్రప్రదేశ్‌లో, 24న చలో చెన్నైలో భాగంగా తమిళనాడులో, 25న చలో బెంగళూరు కర్ణాటకలో భారీ నిరసన ర్యాలీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పి జాతీయ నాయకులు కూచిపూడి సత్యం మాదిగ, రాష్ట్ర నాయకులు, దున్న సాంబయ్య మాదిగ, జిల్లా నాయకులు కారుమూరి అంకయ్య మాదిగ, పత్తిపాటి నియోజకవర్గం ఎంఎస్పి సీనియర్ నాయకులు సిరిమల్లె యాకోబు మాదిగ, సీనియర్ నాయకులు వెలటూరీ ప్రభాకర్ మాదిగ, సీనియర్ నాయకులు కరసాల శ్రీనివాసరావు మాదిగ, ప్రతిపాడు మండల అధ్యక్షుడు తమ్మర్ల యేసుబాబు మాదిగ, మేకల జోజిబాబు మాదిగ, శివనాగేందర్, శేషయ్య, కె. ఆశీర్వాదం, కే నాగరాజు, ఏ పిచ్చయ్య, మాదిగ పాల్గొన్నారు.



లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయండి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

జిల్లాలో ఎయిడ్స్ నియంత్రణ కొరకు నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా లెప్రసి, ఎయిడ్స్‌టిబి అధికారి డాక్టర్ యు.మాధవిలత చెప్పారు. మంగళవారం నాడు జిల్లా కార్యాలయం నుండి జిల్లా ఎయిడ్స్ నియంత్రణ చర్యల పై జిల్లాలోని ఐసిటిసి, పిపిటిసిటి, ఏర్‌టి, డిఎస్ ఆర్ సి, లింక్ ఏర్‌టి, టిఐ ఎన్‌జిఓస్‌తో సమీక్ష సమావేశం నిర్వహించారు. డాక్టర్ యు.మాధవి లత మాట్లాడుతూ జిల్లాలో హెచ్ఐవి, ఎయిడ్స్ నియంత్రణ కొరకు పరీక్షలు పెంచాలని, ఆంధ్ర ప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ వారు జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ జానీభాష, క్లినికల్ సర్వీస్ ఆఫీసర్ చైతన్య, క్లస్టర్ ప్రెవెన్షన్ ఆఫీసర్ కిరణ్, టెక్నికల్ శశిధర్ రెడ్డి, జిల్లా ఎన్ఎసిపి సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి - ఫిరంగిపురం

అక్టోబర్11న ప్రపంచ బాలిక దినోత్సవం సందర్భంగా మంగళవారం మండలంలోని మునగపాడు హైస్కూల్లో నుదురుపాడు పిహెచ్‌సి వారి ఆధ్వర్యంలో ప్రపంచ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్య ఆరోగ్యం రక్షణ పోషకాహారం విలువలతో కూడిన వివిధ అంశాలపై అవగాహన సదస్సు నిర్వహిస్తారు. మునగపాడు హైస్కూలు బాలికలు ఉపాధ్యాయులు నుదురుపాడు పిహెచ్సి హెల్త్ సూపర్వైజర్ కె.సుదర్శన రాజు ఏఎన్ఎంలు ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సెలూన్లకు ఉచిత విద్యుత్ అమలు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

నాయీ బ్రహ్మణలకు ఇచ్చిన హామీను అమలుచేసిన కూటమి ప్రభుత్వానికి తమ సంఘం అండగా ఉంటుందని రాష్ట్ర నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ డైరెక్టర్ కురగంటి రఘురామయ్య అన్నారు. మంగళవారం తన నివాసంవద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నాయిబ్రాహ్మణుల క్షవరశాలలకు 200 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ ఇస్తామన్న హామీను కూటమి ప్రభుత్వం నెరవేర్చడంపట్ల తమ సంఘాల్లో ఆనందోత్సవాలు వెల్లువెత్తుతున్నాయని అన్నారు. విద్యుత్ బిల్లులు నమోదుకు వచ్చిన విద్యుత్ సిబ్బందికి తమ పూర్తి వివరాలు తెలియజేయాలన్నారు.



కంపచెట్ల మధ్య రోగాలతో జీవనం

ధ్వంసమైన గుడారాలు అందని పింఛన్లు : సిపిఎం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పట్టణంలోని క్రీస్తు కాలనీలో కొన్నేళ్లుగా నివాసం ఉంటున్న ఏడు నిరుపేద కుటుంబాలను ఆరు నెలల క్రితం మున్సిపల్ అధికారులు జగనన్న కాలనీ పక్కనున్న ప్రభుత్వ స్థలంలో ఉండాలని చెప్పారని, అయితే అక్కడ వారి జీవనం దుర్భంగా ఉందని సిపిఎం నాయకులు తెలిపారు. ఈ అంశంపై తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం పేదలతో కలిసి విన్నవించారు. సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.రాధాకృష్ణ మాట్లాడుతూ.. ప్రభుత్వం చూపిన స్థలంలో పేదలు గుడారాలేసుకుని ఉంటున్నారని, ఇటీవల గాలివానలకు అవి కూలిపోవడంతో పేదలకు నిలువనీడ కరువైందని చెప్పారు. దోమల ఉధృతి, కంప మొక్కల మధ్య విష పరుగులు భయంతో బతుకుతున్నారని, రోగాల బారిన పడ్డారని వివరించారు. చిన్నపిల్లలకు ఏమవుతుందోనని దిగులు నిత్యం వారిని వెంటాడుతోందన్నారు. వృద్ధులు, వితంతువులకు పింఛన్లు రావడం లేదని తెలిపారు. తహశీల్దార్ మహమ్మద్ హుస్సేన్ స్పందిస్తూ సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే గడువులోగా సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. వినతిపత్రం ఇచ్చినవారిలో సిపిఎం పట్టణ కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు, ఎస్.లూథర్, జేమ్స్ పాల్గొన్నారు.



కెజిబివి పాఠశాలలో ఎంపిడిఒ పరిశీలన

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండలంలోని గోళ్లపాడు గ్రామంలోని కెజిబివి పాఠశాలను ఎంపిడిఒ పి.రత్నం, పిహెచ్‌సి వైద్యులు పి.రమాదేవి మంగళవారం సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న వసతులను, మౌళిక సదుపాయాలను, పాఠశాలలోని పరిసరాలను పరిశీలించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని వ్యాధులు ప్రభలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపిడిఒ సూచించారు. పాఠశాల ఎస్వో ఝాన్సీ సుహుర్లత, జూనియర్ అసిస్టెంట్ సాయి చరణ్, ఏపివో ఏడుకొండలు పాల్గొన్నారు.

ఎక్స్‌ప్రెస్ హాల్టుకు డిఆర్ఎం సానుకూల స్పందన

ప్రజాశక్తి - పెదకూరపాడు : నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడు రైల్వేస్టేషన్‌లో పల్నాడు, రేపల్లె ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్ట్ గురించి తనస్థాయిలో సహకరిస్తానని గుంటూరు రైల్వే డివిజినల్ మేనేజర్ (డిఆర్ఎం) సుధేష్ణ హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు లేఖతోపాటు పెదకూరపాడు పరిసర గ్రామాలకు చెందిన 4వేల మంది ప్రజల సంతకాలు, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ లేఖ, స్థానిక సంస్థల తీర్మానాల ప్రతులు, ఇతర వివరాలతో కూడిన వినతిపత్రాన్ని డిఆర్ఎంకు నాయకులు మంగళవారం అందించారు. హైదరాబాద్ రాకపోకలకు రైలు ప్రయాణ సౌకర్యం లేక ఈ ప్రాంత ప్రజలు పడుతున్న ఇబ్బందులను వివరించారు. పల్నాడు ఎక్స్‌ప్రెస్ నిలుపుదలకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని ఇవ్వాలని నాయకులు కోరారు. వినతిపత్రం ఇచ్చినవారిలో అభ్యుదయ రచయతల సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.శరచ్చంద్ర జ్యోతిశ్రీ, పెదకూరపాడు మాజీ సర్పంచ్ భాష్యం ఆంజనేయులు, టిడిపి నాయకులు ఎ.రమేష్, క్రోసూరు మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్ బి.రామగోపాలరావు ఉన్నారు.

కౌల్దార్లకు 'అన్నదాత సుఖీభవ'ను ఇవ్వాలి

గుర్తింపు కార్డులు, పంట రుణాలతోపాటు చట్టం మార్పునకు కౌలురైతు సంఘం వినతి



రొంపిచర్లలో వినతిపత్రం ఇస్తున్న నాయకులు



ముప్పాళ్లలో వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి-చిలకలూరిపేట, రొంపిచర్ల, ముప్పాళ్ల

కౌలురైతులందరికీ గుర్తింపు కార్డులు జారీ చేస్తామని, ఇందుకు అవరోధంగా ఉన్న పాత చట్టాన్ని రద్దు చేసి కొత్త చట్టాన్ని తెస్తామని ఎన్నికలప్పుడు కూటమి ఇచ్చిన హామీని విస్మరించిందని కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ, పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.రామారావు, రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జి.బాలకృష్ణ విమర్శించారు. కౌలురైతులకు అన్నదాత సుఖీభవ పథకం, రుణాలు తదితర సమస్యలపై చిలకలూరిపేటలో తహశీల్దార్ మహమ్మద్ హుస్సేన్‌కు, రొంపిచర్లలో తహశీల్దార్‌కు రామారావుతోపాటు నాయకులు ఎస్.లక్ష్మిరెడ్డి, ముప్పాళ్లలో తహశీల్దార్ నగేష్‌కు మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా చిలకలూరిపేటలో రాధాకృష్ణ మాట్లాడుతూ అక్టోబర్‌లో కౌలురైతులకు అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేల పెట్టుబడి సాయం ఇస్తామని ప్రకటించినా ఆ ఊసే లేదని, ఇప్పటికైనా అర్హుల జాబితాను ప్రకటించి ఒకేసారి సాయం మొత్తాన్ని ఇవ్వాలని కోరారు. కొత్త కౌలుచట్టం తెచ్చి కౌలురైతులందరికీ కార్డులివ్వాలని, స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రూ.2 లక్షల వరకు హామీలేని రుణాలు, ఇతర పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియాతోపాటు భార్యలకు వితంతు పింఛను, పిల్లలకు చదువు బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలన్నారు. భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా కౌల్దార్లకు గుర్తింపు కార్డులిస్తామని అసెంబ్లీలో 18 నెలల కిందటే ప్రకటించినా చట్టాన్ని ఇంకా మోదించలేదన్నారు. పంట రుణాలూ మంజూరు కావడం లేదని చెప్పారు. వీటన్నింటిపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చినవారిలో నాయకులు ఎస్.లూథర్, జేమ్స్ ఉన్నారు. రొంపిచర్లలో ఎస్.వెంకటేశ్వరరాజు, వి.శ్రీనివాసరావు, గురుమూర్తి, రాజేష్ పాల్గొన్నారు. ముప్పాళ్లలో నాయకులు టి.అమరలింగేశ్వరరావు, ఐ.పెద్దిరెడ్డి, ఎం.జగన్మోహన్‌రెడ్డి, ఒ.వెంకటేశ్వర్లు, జాన్‌పీరా పాల్గొన్నారు.

తాత్కాలిక షాపుల నిర్మాణానికి స్థలాల పరిశీలన

మెప్మా ఆధ్వర్యంలో డ్వాక్రా సంఘాలతో వ్యాపారానికి అంచనాలు



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు తదితరులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పట్టణ పేదల పేదరిక నిర్మూలనకు కీలక పాత్ర పోషిస్తున్న మిషన్ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ పవర్టీ ఇన్ మ్యూనిసిపల్ ఏరియాస్ (మెప్మా) ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల మార్కెటింగ్‌కు తాత్కాలిక షాపుల నిర్మాణానికి మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్లు స్థలాలను పరిశీలించారు. 2007లో స్థాపించబడిన ఈ సంస్థ రాష్ట్రంలోని 123 పట్టణ స్థానిక సంస్థల్లో స్వయం స్థిరమైన సంస్థలను ప్రోత్సహించడం, బలోపేతం చేయడం, సంరక్షించడం ద్వారా పట్టణ పేదల ఆర్థిక స్వావలంబనను ప్రోత్సహిస్తుందన్నారు. పట్టణంలోని ఆరు ముఖ్య ప్రాంతాలలో రహదారి వెంట మార్జిన్‌లు, వాణిజ్య కేంద్రాల సమీపంలో ఉన్న ప్రదేశాలను పరిశీలించిన బృందం వ్యాపారానికి అనువుగా ఉండే ప్లాట్‌ఫారమ్‌ల నిర్మాణానికి అనుకూలతను అంచనా వేసింది. ఈ ప్లాట్‌ఫారమ్‌ల నిర్మాణం మెప్మా సభ్యులకు అనుబంధంగా నరసరావుపేట మున్సిపాలిటీ బాధ్యతగా ఉంటుందన్నారు. మెప్మా ఐరన్ కంటైనర్లు, మోడ్యులర్ వెండింగ్ యూనిట్ల వంటి తాత్కాలిక షాపులను ఏర్పాటు చేస్తారని అధికారులు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో ఇలాంటి మోడ్యులర్ వెండింగ్ మార్కెట్లకు రూ.26.10 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. 580 షాపులకు సంబంధించిన ప్రాజెక్టులు గ్రూపుల బ్యాంకు రుణాలు, మెప్మా మద్దతు మున్సిపల్ నిధుల ద్వారా అమలవుతాయన్నారు. షాపుల ద్వారా రాష్ట్రంలో 2.74 లక్షల గ్రూపులకు చెందిన 22.62 లక్షల మంది మహిళలు తమ ఉత్పత్తులను - హస్తకళలు, ఆహార పదార్థాలు, వ్యవసాయ ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకోవచ్చన్నారు.



ఖోఖో అండర్-19 ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు వశిష్ట కళాశాల విద్యార్థులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 ఖోఖో ఉమ్మడి గుంటూరు జిల్లా బాల, బాలికల జట్లకు తమ విద్యార్థులు ఎంపికయ్యారని నరసరావుపేట వశిష్ట జూనియర్ కళాశాల డైరెక్టర్ మద్దుల నరేష్ కుమార్ మంగళవారం తెలిపారు.బాలుర జట్టుకు కె.ఆంజనేయ నాయక్, బాలికల జట్టుకు పి.కృష్ణవేణి ఎంపికైనట్లు చెప్పారు. తమ కళాశాలలో విద్యార్థులకు విద్యతో పాటు క్రీడల్లోనూ ప్రత్యేక శిక్షణిస్తున్న నేపథ్యంలో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవుతున్నారన్నారు. ఎంపికైన వారితోపాటు పీడీ వై.సురేష్‌ను చైర్మన్ మద్దుల కోటేశ్వరరావు, వైస్ చైర్మన్ నర్రా శేషగిరిరావు, డైరెక్టర్లు నల్లపాటి శ్రీకాంత్, భవిరిశెట్టి మదన రాజారావు, ప్రిన్సిపల్ శివనాగేశ్వరరావు, అధ్యాపకులు అభినందించారు.

అంగన్వాడీల రాజీనామాల కోసం రాజకీయ ఒత్తిళ్లు

- **మానసికంగా కుంగిపోతున్న అంగన్వాడీలు**
- **ఎవరు బెదిరించినా రాజీనామా చేయొద్దు.. యూనియన్ దృష్టికి తీసుకురండి : సిఐటియు**

ప్రజాశక్తి - మాచర్ల

అంగన్వాడీలతో బలవంతపు రాజీనామాలు చేయించాలని రాజకీయ నాయకులు యత్నిస్తున్నారని, చిన్న ఉద్యోగుల పట్ల ఇలాంటి రాజకీయ వేధింపులను సత్వరం మానుకోవాలని ఆంధ్రప్రదేశ్ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) పల్నాడు జిల్లా గౌరవాధ్యక్షులు జి.మల్లేశ్వరి, అధ్యక్షులు ఎ.లక్ష్మీ ప్రసన్న, కార్యదర్శి డి.శాంతమణి డిమాండ్ చేశారు. డిసెంబర్ 31 నుండి జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరిగే సిఐటియు అఖిల భారత 18వ మహాసభలను జయప్రదం కోసం వారు మాచర్ల ఐసిడిఎస్ పరిధిలోని ఐదు మండలాల్లోని అంగన్వాడీ సెంటర్లను సందర్శించారు. అంగన్వాడీలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మాచర్లలోని సిఐటియు కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. మాచర్ల ఐసిడిఎస్ ప్రాజక్టు పరిధిలో అంగన్వాడి కార్యకర్తలు, సహాయకులు రాజకీయ వేధింపులకు గురవుతున్నారన్నారు. వెల్దుర్తి మండలం కొత్తపుల్లారెడ్డి గూడెంలో రాజకీయ నాయకులు ఇద్దరు ఆయాలను విధులు నిర్వహించకుండా ఆపారని, ఆ స్థానాల్లో వారి మనుషులను పెట్టారని అన్నారు. ఆ ఇద్దరు ఆయాలు ప్రతిరోజూ అంగన్వాడీ సెంటర్‌కు వెళుతూనే



వున్నారని, ఆగస్టు నెల నుండి వారికి జీతాలు కూడా వేయటం లేదని తెలిపారు. ఉన్నతాధికారుల వెంటనే స్పందించి న్యాయం చేయాలని కోరారు. ఎంత ఒత్తిళ్లు చేసినా ఎవరూ రాజీనామాలు చేయద్దని, ఇబ్బందులుంటే తమకు సంప్రదించాలని, యూనియన్ అండగా వుంటుందని చెప్పారు. సెల్‌ఫోన్లు వెనక్కి ఇప్పించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా యూనియన్ ఉద్యమించి ఫోన్లు తిరిగి ఇప్పించిదని, ఆ సమయంలో జరిగిన చర్చల్లో కొన్ని సమస్యలు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా పరిష్కరిస్తామని హామీనిచ్చారని తెలిపారు. అయితే క్షేత్ర స్థాయిలో అవే సమస్యలు ఉన్నాయన్నారు. ఆరు రిజిష్టర్లు రాస్తే సరిపోతుందని ప్రభుత్వం చెప్పినా 11 రిజిష్టర్లు రాయిస్తున్నారన్నారు. అధికారుల విజిట్‌లో 11 రిజిష్టర్లను పరిశీలిస్తున్నారని, ఇది టీచర్లకు అధిక భారమవుతోందని, మానసికంగా కుంగిపోతున్నారని తెలిపారు. రిజిష్టర్లు కూడా అంగన్వాడీలే రూ.వెయ్యి సొంత డబ్బుతో కొనాల్సి వస్తోందన్నారు. మున్సిపాలిటి పరిధిలో రూ.6వేలు, రూరల్ పరిధిలో రూ.2వేలు అంగన్వాడీ సెంటర్లకు అద్దె చెల్లించాల్సి ఉన్నా ఇవ్వటం లేదన్నారు. సమస్యలపై గతంలో సమ్మె చేయగా మద్దతు, హామీలిచ్చిన నేటి పాలక పార్టీలు ఇప్పుడు విస్మరించారన్నారు. జీతాలు పెంచాలని, కొత్త ఫోన్లు ఇవ్వాలని, సూపర్ వైజర్లు విజిట్స్ ఎక్కువ చేసి అంగన్వాడీ సెంటర్లను సమర్థవంతంగా నిర్వహించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు షేక్ హజ్రా, మాచర్ల ప్రాజెక్టు అధ్యక్షులు జె.జయలక్ష్మి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు హరి పాల్గొన్నారు.

ఎంటిఎంసిలో పేదలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ - మంత్రి నారా లోకేష్ ఎన్నికలకు ముందు వేసిన శిలాఫలకం ప్ల కార్డుల ప్రదర్శనతో రెండోరోజు నిరసన



మంగళగిరి నిరసన దీక్షలో మాట్లాడుతున్న వై నేతాజీ

ప్రజాశక్తి మంగళగిరి

మంగళగిరి కార్పొరేషన్ పరిధిలో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాల హామీని మంత్రి నారా లోకేష్ వెంటనే నెరవేర్చాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై నేతాజీ డిమాండ్ చేశారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ జరుగుతున్న నిరసన దీక్ష మంగళవారం నాటికి రెండో రోజు చేరింది. దీక్షా శిబిరాన్ని నేతాజీ ప్రారంభించి మాట్లాడారు. దీక్షా శిబిరంలో ఎన్నికలకు ముందు ప్రకాశం బ్యారేజీ సమీపంలో లోకేష్ వేసిన శిలాఫలకం ప్ల కార్డులతో నిరసన వ్యక్తం చేశారు. 20,000 మందికి ఇళ్ల పట్టాలు ఇస్తానని, ఇళ్ల స్థలం లేని నిరుపేదలకు ఇళ్ల స్థలం ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పారని, నిరుపేదల లిస్టును బహిరంగపరచాలని కోరారు. గత పుష్కరాల సందర్భంగా తాడేపల్లిలో నిరుపేదలైన 250 మందికి సంబంధించిన ఇళ్లను కూల్చివేయడం జరిగిందని అన్నారు. ఆనాటి నుండి 30 గజాల స్థలంలో రేకుల షెడ్డులు వేసుకొని నివాసముంటున్నారని వారందరికీ ఇళ్ల స్థలం ఇచ్చి ఇల్లు నిర్మించి ఇవ్వాలని అన్నారు. గత 40 సంవత్సరాల కాలంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వలేదని అన్నారు. మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చి 16 నెలలు గడిచినప్పటికీ ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. దీంతో కార్పొరేషన్ పరిధిలో ఉన్న పేదలు ఇళ్ల స్థలాల అర్జీలు పూర్తిచేసుకుని ఈనెల 17వ తేదీన కార్పొరేషన్ కార్యాలయం వద్ద మహా ధర్నా నిర్వహిస్తున్నట్లుగా తెలిపారు. ఈ ధర్నా కార్యక్రమానికి కార్పొరేషన్ పరిధిలో పేదలందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సిపిఎం తాడేపల్లి పట్టణ కార్యదర్శి బి వెంకటేశ్వరావు మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మంగళగిరి పట్టణ కార్యదర్శి వివి జవహర్లాల్, తాడేపల్లి మండలం రూరల్ కార్యదర్శి పల్లె కృష్ణ, సిపిఎం గుంటూరు జిల్లా నాయకులు ఎస్ ఎస్ చెంగయ్య, సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బాలాజీ, సిపిఎం తాడేపల్లి పట్టణ, రూరల్ నాయకులు వేముల దుర్గారావు, డి భాస్కర్ రెడ్డి, బర్నబాస్, ఎం నాగేశ్వరావు, విజయబాబు, గన్ను, సాంబశివరావు, కే బాబురావు పాల్గొన్నారు.

ఇంటి స్థలాలు, పట్టాలు ఇవ్వకుంటే ఆందోళన ఉధృతం

ప్రజాశక్తి - పెదకాకాని

అర్హులైన పేదలందరికీ ఇండ్ల స్థలాలు, ఇండ్ల పట్టాలు ఇవ్వకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి సభ్యులు పాశం రామారావు హెచ్చరించారు. మండల కేంద్రమైన పెదకాకానిలో మంగళవారం తాహశీల్దార్ కార్యాలయం వద్ద ఇండ్ల స్థలాలు పట్టాల సాధన కోసం సిపిఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పాశం రామారావు మాట్లాడుతూ మండలంలోని సుందరయ్య కాలనీ, ఎస్ టి కాలనీ, వడ్డెర కాలనీ, జాన్ హాస్పర్ కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, స్వర్ణపురి కాలనీలలో గత 20 సంవత్సరాలుగా ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్న పేదలకు పట్టాలు ఇవ్వాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు పట్టణాలలో రెండు సెంట్లు గ్రామాలలో మూడు సెంట్లు ఇస్తామని వాగ్దానం చేశారని ఆ వాగ్దానాన్ని అమలు చేయాలని కోరారు. పేదల పట్టాల విషయంలో మీన మేషాలు లెక్కపెడుతున్న ప్రభుత్వం పెద్ద పెద్ద కార్పోరేట్ సంస్థలకు, పెట్టుబడిదారులకు పరిశ్రమల అభివృద్ధి పేరుతో లక్షలాది ఎకరాలు అవలీలగా కట్టబెడుతున్నారన్నారు. పేదలకు ఇండ్ల పట్టాలు ఇచ్చేందుకు నిబంధన పేరుతో కాలయాపన చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం జగనన్న కాలనీల పేరుతో స్థలాలు ఇచ్చిన ఇంతవరకు వాటిలో నిర్మాణాలు జరపలేదని, ఇంటి నిర్మాణాలు జరిగినచోట మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. పెదకాకాని మండలంలో పేదలకు రాజధానిలో ఇళ్లస్థలాలు ఇస్తామని చెప్పి మొండి చెయ్యి చూపించారన్నారు. సిపిఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ అత్యంత నిరుపేదలైన గిరిజనులు గత పది సంవత్సరాల నుండి నంబూరు అడ్డరోడ్డులో నివాసం ఉంటున్నారని వారికి ప్రత్యామ్నాయం చూపి ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. తక్కెళ్ళపాడు రోడ్డు పక్కన నివాసం ఉంటున్న 80 మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. శివారు కాలనీల ప్రజలు వర్షం వస్తే నీరు ఇండ్లలోకి వస్తుందని సరైన సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా మని తాసిల్దార్ కి విన్నవించారు. ప్రభుత్వం ఇళ్ల స్థలాలు పట్టాలపై స్పందించకుంటే తాసిల్దార్ కార్యాలయం వద్ద త్వరలో వంటావార్పు కార్యక్రమం చేపడతామన్నారు. అనంతరం తాహశీల్దార్ పి.కృష్ణకాంత్‌కు ఆయా కాలనీల ప్రజలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తాసిల్దార్ కృష్ణ కాంత్ స్పందిస్తూ సుందరయ్య కాలనీలో 145 పట్టాలు సిద్ధం చేశామని ప్రొసీజర్ పూర్తి చేసి వారికి పట్టాలు ఇస్తామని, మండలంలో ఇతర గ్రామాల్లో పేదల సమస్యలపై అధికారుల దృష్టికి తీసుకు వెళ్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బురదగుంట సాంబయ్య, కె.సత్యనారాయణ, వెంకటరమణ, ఏ. నాగేశ్వ రావు, సుందరయ్య కాలనీ వాసులు జెట్టి రాజలక్ష్మి, షేక్.హసీనా, షేక్.మరింబి, పి.పావని, శివ దుర్గ ఎస్టీ కాలనీ స్వర్ణ పూరి కాలనీ పాల్గొన్నారు.


పెదకాకానిలో ధర్నాలో మాట్లాడుతున్న పాశం రామారావు


తహశీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న కాలనీ వాసులు

డిఅండ్ఒ ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో ప్రతి కమర్షియల్ సంస్థకు డిఅండ్ఒ ట్రేడ్ లైసెన్స్ ఉండాలని, రోడ్లు, డ్రైన్లపై ఉన్న ఆక్రమణలకు లైసెన్సులు జారీ చేయెుద్దని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. మంగళవారం జిఎంసి కౌన్సిల్ సామవేశ మందిరంలో ప్రజారోగ్య విభాగం అధికారులు, కార్యదర్శులతో ట్రేడ్‌లైసెన్స్‌లు, పారిశుధ్య పనులపై సమీక్షా సమావేశం నిర్వహిం చారు. కమిషనర్ మాట్లాడుతూ డిఅండ్ఒ ట్రేడ్ లైసెన్సు ఉండాల్సిన సంఖ్య కన్నా చాలా తక్కువగా ఉన్నాయని, శానిటరీ డివిజన్ల వారీగా ఇన్స్పెక్టర్లు ప్రస్తుతం ఉన్న ట్రేడ్ లైసెన్స్‌లు, రెన్యువల్ చేసుకున్నవి, నూతనంగా తీసుకోవాల్సి ఉన్నవాటికి ఇవ్వడం, ఫీజుల వసూళ్లపై ప్రత్యేక ద్రుష్టి సారించాలన్నారు. తమ క్షేత్ర స్థాయిలో పర్యటనలో ట్రేడ్ లైసెన్స్‌లపై దష్టి సారిస్తామని, ఎక్కడైనా ట్రేడ్ లైసెన్స్ లేకుండా, ఫీజులు చెల్లించకుండా కమర్షియల్ సంస్థలు ఉంటే సంబందిత కార్యదర్శిపై, పర్యవేక్షణ అధికారి అయిన ఇన్స్పెక్టర్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

25న తెనాలిలో పాడి రైతుల జిల్లా మహాసభ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

పాల రైతులకు తక్షణమే గిట్టుబాటు ధర కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివ సాంబిరెడ్డి కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల మాదిరిగా లీటరుకు రూ.8 నుండి 10 రూపాయలు ప్రోత్సాహక ధర ప్రకటించాలని తదితర డిమాండ్‌ల సాధన కోరుతూ అక్టోబర్ 25వ తేదీ తెనాలి నన్నపనేని సీతారామయ్య సరస్వతమ్మ కళ్యాణమండపంలో నిర్వహించనున్న ఎపి పాల రైతుల జిల్లా ప్రధమ మహాసభను. పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.మంగళవారం స్థానిక ఐతానగర్, నేలపాడు, తేలప్రోలు, కంచర్లపాలెం గ్రామాల్లో పాల రైతులతో కలసి కరపత్రాలు పంపిణి చేశారు. ప్రస్తుతం పాడి కొనుగోలుకు రూ. 1 లక్ష వెచ్చించాల్సి ఉందని, వరిగడ్డి ఎకరాకు రూ.4 నుంచి 5 వేల వరకూ మార్కెట్ ధర ఉందని, హార్వెస్ట్ కారణంగా దాణా, పశువుల మందుల ధరలు పెరిగాయన్నారు. కానీ లీటరు గేదె పాలకు రూ. 40, ఆవు పాలకు రూ. 20 కి మించి డైరీలో ధర రావట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకపక్క బ్యాంకులు, కోపరేటివ్ సొసైటీలు పాడి పశువులకు రుణాలు ఇవ్వకపోవడం, మరోపక్క ప్రైవేటు డైరీలపై ప్రభుత్వం నియంత్రణ లేకపోవడం కారణంగా కోట్లలో లాభాలు దండుకుంటున్నారని పేర్కొన్నారు. మార్కెట్ ధర ప్రకారం పాడి పశువులకు బీమా నిర్ణయించి ఇవ్వాలని, ప్రభుత్వమే ప్రీమియంను చెల్లించాలని పాల రైతుల సంఘం జిల్లా నాయకురాలు వేజెండ్ల తెలిపారు. పశువుల ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది, మందులను అందుబాటులో ఉంచాలని, కల్తీ పాలను కట్టడి చేయాలని కోరారు. అనంతరం పాల రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు అక్టోబర్ 25న జరిగే జిల్లా మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమం లో తెనాలి శాంతకుమారి, ఎం పద్మ, వై మేరమ్మ, కె శకుంతల, ఎ సరోజిని, టి నిర్మల, ఇ సంతోషం, టి మేరమ్మ, సుశీల తదితరులు పాల్గొన్నారు.


తెనాలిలో కరపత్రం ఆవిష్కరిస్తున్న సాంబిరెడ్డి తదితరులు

తాగునీటి క్లోరిన్ పరీక్షలు క్రమం తప్పకుండా చేయాలి : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో నగరపాలక సంస్థ సరఫరా చేసే తాగునీటిని ఎప్పటికప్పుడు క్లోరిన్ టెస్ట్ చేయాలని, ఎక్కడైనా పైప్‌లైన్ లీకులు గుర్తిస్తే తక్షణం మరమ్మతు చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కమిషనర్ భారత్ పేట, అరండల్ పేట, అశోక్ నగర్, రెడ్డిపాలెం తదితర ప్రాంతాల్లో పిజిఆర్ఎస్, డయల్ యువర్ కమిషనర్ లో ప్రజల నుండి అందిన ఫిర్యాదులను నేరుగా పరిశీలించి, తీసుకోవాల్సిన చర్యలపై సంబందిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. పర్యటనలో డిఈఈ రమేష్‌బాబు, పట్టణప్రణాళిక విభాగం అధికారులు పాల్గొన్నారు.

గ్రీన్ విలేజ్‌పై సర్పంచ్‌లు, సెక్రెటరీలకు శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు రూరల్, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ బండి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంగళవారం సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు థీమ్-5, క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్‌పై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో ఎల్ఎస్‌డిజి థీమ్-5, క్లీన్ అండ్ గ్రీన్ విలేజి లక్ష్యాన్ని 2030 నాటికి సాధించటానికి పాటించాల్సిన వివిధ రకాల వ్యర్థ పదార్థాల నిర్వహణ పద్ధతులు తెలుసుకోవటానికి ఈ శిక్షణ ఉపయోగపడుతుందని చెప్పారు. వీటిని గ్రామాలలో అవలంబిస్తే క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ సాధించటానికి ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. అందులో భాగంగానే ఘన వ్యర్థాల నిర్వహణ కోసం స్వచ్ఛరథం అనే పైలెట్ ప్రాజెక్టుగా గుంటూరు రూరల్ మండలంలో ప్రారంభించడం జరిగిందనదని దీనిని స్ఫూర్తిగా తీసుకొని రాష్ట్రమంతటా అన్ని మండలాల్లో స్వచ్ఛరథం ప్రారంభించినట్లు చెప్పారు. శిక్షణకు బి.రోజేప్రకాష్, ఎ.శ్రీదేవి, ఎఆర్‌వి సత్యానంద్ మాస్టర్ ట్రైనర్లుగా వ్యవహరించారు. కార్యక్రమంలో కార్యాలయ ఏఒ కె.విద్యాసాగర్‌రెడ్డి, డిప్యూటీ ఎంపిడిఒ కె. శ్రీనివాసరావు, గ్రామ పంచాయితీ కార్యదర్శులు, గ్రామ సర్పంచులు, ఉప సర్పంచులు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.


తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న కౌలు రైతు సంఘం నాయకులు

కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ వర్తింపజేయాలి

ప్రజాశక్తి - మేడికొండూరు

మండలంలోని భూమిలేని కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం వర్తింపజేయాలని కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం తాహశీల్దార్ రాఘవరావుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం నాయకులు బొట్ల రామకృష్ణ మాట్లాడుతూ కౌలు గుర్తింపు కార్డు లేనిదే మండల క్షేత్రస్థాయి అధికారులు ఈ- క్రాప్ కౌలు రైతుల పేర నమోదు చేయుట లేదని, భూ యజమానులకే నమోదు చేస్తున్నారన్నారు. ఫలితంగా కౌలు రైతులకు యూరియా, ఇతర సబ్సిడీలు అందటం లేదన్నారు. టిడిపి ప్రభుత్వం ఎన్నికల్లో గత ప్రభుత్వం అమలు చేసిన చట్టాన్ని రద్దుచేసి, నూతన చట్టంలో భూ యజమాని ప్రమేయం లేని చట్టం చేసి కౌలు రైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకం అమలు చేస్తానని బహిరంగ వాగ్దానం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 18 నెలలు గడిచిన, ఇటీవల జరిగిన శాసనసభ సమావేశంలో కూడా కౌలుదారులకి చట్టం చేసే ప్రస్తావనే తేలేదు అని అన్నారు. ప్రస్తుత పంటలకు గిట్టుబాటు ధర లేక, కౌలు రైతులకు ప్రభుత్వ రుణ సదుపాయం లేక ,ఇన్సూరెన్స్ పథకం కౌలు రైతులకు అమలు లేక కౌలు రైతు పూర్తిగా నష్టపోతున్నాడన్నారు. కౌలు రైతు చట్టంలో ప్రస్తుతం ఉన్న ఆంక్షలు తొలగించి, సరళంగా కౌలుకు సాగు చేసే రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని కౌలు రైతుల సంఘం డిమాండ్ చేస్తున్నది అని అన్నారు. కార్యక్రమంలో కౌలు సంఘ నాయకులు షేక్ ఇమామ్ షరీఫ్, షేక్ కరిముల్లా,చల్లా గంగదాసు, రాపూరి సుబ్రహ్మణ్యం, షేక్ సైదా పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

తెలుగు మహిళల నిరసన

ప్రజాశక్తి - వినుకొండ

ఆడవాళ్లంతా తాగుబోతులంటూ మహిళలను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మ నాయుడు పై తెలుగు మహిళలు, జనసేన వీర మహిళలు, బీజేపీ మహిళా మోర్చా నాయకులు, మహిళా సంఘాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వినుకొండ స్థూపం సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి తెలుగు మహిళలు, మహిళా సంఘాల ప్రతినిధులు నిరసన వ్యక్తం చేశారు. బొల్లా బ్రహ్మనాయుడు ఫ్లెక్సీకి చెప్పుల దండ వేశారు. అనంతరం స్థూపం సెంటర్ నుంచి పట్టణ పోలీస్‌స్టేషన్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. బొల్లా బ్రహ్మనాయుడుకు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించి పెద్దఎత్తున నినదించారు. మహిళల గురించి అనుచిత వ్యాఖ్యలు చేసిన బొల్లాను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ వినుకొండ పట్టణ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్‌కు తెలుగు మహిళలు, మహిళా సంఘాల నాయకులు ఫిర్యాదు చేశారు. అవమానకరంగా మాట్లాడి మహిళలు కన్నీరు పెట్టేలా చేసిన బొల్లా బహిరంగ క్షమాపణ చెప్పాలని, అనుచిత వ్యాఖ్యలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఛైర్ పర్సన్ షకీలా, తెలుగు మహిళలు, జనసేన వీరమహిళలు, బీజేపీ మహిళా నాయకులు పాల్గొన్నారు.

కనక నారాయణ మృతికి ఎమ్మెల్యే సంతాపం

ప్రజాశక్తి - వినుకొండ


కనకనారాయణ(ఫైల్)

శావల్యాపురం మండలం వయకల్లు గ్రామ మాజీ ఉప సర్పంచ్, ప్రముఖ కళాకారుడు కర్రె కనక నారాయణ (60) మృతికి ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు సంతాపం తెలిపారు. కనక నారాయణ గ్రామంలో టిడిపి నాయకుడిగా, మాజీ ఉపసర్పంచ్‌గా పనిచేసే ప్రజలకు ఎన్నో సేవలు అందిం చారని అన్నారు. ఆయన కళారంగానికి అందించిన సేవలు మరువలేనివన్నారు. సినీ కోఆర్డినేటర్‌గా, సాంఘిక నాటకాల రచన, ఎన్నో ప్రదర్శనలు ఇచ్చి నాటి సీఎం ఎన్టీఆర్ చేతుల మీదుగా అవా ర్డు అందుకున్న ఉత్తమ కళాకారుడు కనక నారాయణని కొనియాడారు. గ్రామంలో ప్రజలకు, పార్టీకి, రాష్ట్ర వ్యాప్తంగా కలహారంగానికి కనకనారాయణ అందించిన సేవలను గుర్తు చేస్తూ ఆయన కుటుంబ సభ్యులకు ఆంజనేయులు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్

ప్రజాశక్తి - వినుకొండ

పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, పర్యావరణం కోసం మొక్కలు నాటడం, ప్రజల సంపూర్ణ ఆరోగ్య కోసం శిబిరాలు నిర్వహించడం వంటి కార్యక్రమాలకు రోటరీ క్లబ్ ప్రాధాన్యత ఇస్తుందనీ, నాగేంద్రుడు మాష్టారు వంటి దాతల సహకారంతో వాటిని నెరవేర్చడంలో కొంత పురోగతి సాధిస్తున్నామని రోటరీ క్లబ్ అఫ్ గ్రేటర్ వినుకొండ అధ్యక్షులు యేరువ వెంకటనారాయణ అన్నారు. పట్టణంలోని హనుమాన్ నగర్ ప్రాథమిక పాఠశాల ఆఫీస్‌కు అవసరమైన బీరువా, ఓబయ్య కాలనీ లోని మండల విద్య వనరుల కేంద్రానికి అవసరమైన పోర్టబుల్ మైక్ సెట్ ను రోటరీ క్లబ్ వారు అందజేశారు ఈ సందర్భంగా దాత నాగేంద్రుడు మాస్టార్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సత్కరించారు. క్లబ్ కార్యదర్శి షేక్‌బాబా, ట్రెజరర్ పొత్తూరి నవీన్, జిల్లా ముఖ్యులు ఆలా శ్రీనివాసరావు, అడ్మినిస్ట్రేటర్ కూచి రామాంజనేయులు, జఫరుల్లా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫోన్‌లోనే సచివాలయం అప్లికేషన్లు

రెండు నెలలుగా నో కంప్యూటర్.?
అలంకారంగా ఉద్యోగులు..?
పట్టించుకోని ఉన్నతాధికారులు

ప్రజాశక్తి - రాజుపాలెం


కంప్యూటర్ పని చేయకపోవడంతో కనిపించని సిబ్బంది

పేరుగాంచిన మండల కేంద్రమైన రాజుపాలెం చరిత్ర కలిగిన ఒకప్పటి సమితి కేంద్రం. కానీ రోజురోజుకు సౌకర్యాలు నశించిపోతున్నాయి. తాజాగా గ్రామ సచివాలయంలో కంప్యూటర్ రిపేర్ రావడంతో అప్లికేషన్లు ఆన్‌లైన్‌లో చేయడం కూడా ఆపేశారు. కంప్యూటర్ రిపేర్ వచ్చి రెండు నెలలవుతోంది అది సాధారణ విషయం అన్నట్లు సంబంధిత సచివాలయం కార్యదర్శి పట్టించుకోపోవడం విమర్శలకు తావిస్తోంది. అత్యధిక జనాభా కలిగిన రాజు పాలెం గ్రామానికి సమీప ప్రాంత ప్రజలు వివిధ రకాల పనులపై వస్తుంటారు. సచివాలయం పరిధిలోని ప్రజలూ ఇక్కడే దరఖాస్తులు చేస్తుంటారు. ఏ పని కావాలన్నా కంప్యూటర్‌లోనే అప్లికేషన్లు పెట్టాల్సి వస్తుంది. సచివాలయంలో దరఖాస్తు చేయడం తప్పనిసరి. ఈ పరిస్థితుల్లో నెలల తరబడి సచివాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. ప్రభుత్వం అమలు చేసే ఏ పథకానికైనా కొన్ని అర్హతా పత్రాలను జత చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో సచివాలయ సిబ్బంది మాత్రం ఒకటి, అర అప్లికేషన్లు మాత్రం ఫోన్‌లో చేస్తూ కాలయాపన చేయడం ఎంత వరకు సమంజసమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇంకా ఎన్ని నెలలు పనులు చేయకుండా సమాధానం చెప్తారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి సచివాలయంలోని కంప్యూ టర్ రిపేర్ సమస్యను పరిష్కరిం చాలని మండల, పరిసర గ్రామాలు, రాజుపాలెం గ్రామ ప్రజలు కోరుతున్నారు.


కోటి సంతకాల సేకరణలో పలువురు

కొత్తపల్లిలో కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి - విజయపురిసౌత్

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మంగళవారం మాచర్ల మండలం, కొత్తపల్లి గ్రామంలో కోటి సంతకాల సేకరణ చేపట్టారు. పల్నాడు జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి పోతిరెడ్డి కోటిరెడ్డి, జిల్లా రైతు విభాగం సభ్యులు అరికట్ల పున్నారెడ్డి, మాచర్ల మండల మేధావుల ఫోరం అధ్యక్షులు ఓరుగంటి జయ భారత్ రెడ్డి, కొతపల్లి గ్రామ సర్పంచ్ ఓరుగంటి జయప్రకాష్ రెడ్డి, గ్రామ కమిటీ సభ్యులు, డి.లక్ష్మారెడ్డి, ఏ.సాంబశివారెడ్డి, పి.లచ్చయ్య, డి.కొండలు, జి. వెంకటేశ్వర్లు, ఎం. బక్కయ్య, ఎం.సూక్య నాయక్, ఏ.ఎలీషా, ఎం. సామేలు, ఏ.అంజయ్య, డి.రంగారావు, మహేష్ రెడ్డి పాల్గొన్నారు .

ప్రజాశక్తి - వినుకొండ

ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి రాష్ట్రవ్యాప్తంగా కోటి సంతకాల సేకరణను పార్టీ శ్రేణులు విస్తృతంగా చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే, వైసిపి పిఏసి సభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు కోరారు. రచ్చబండ నిర్వహణపై మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నాయకులతో సమావేశం నిర్వహించారు. వినుకొండ నియోజకవర్గంలో గ్రామస్థాయిలో ప్రజల నుంచి పెద్ద సంఖ్యలో సంతకాలు సేకరించడం. ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరించాలని కోరారు. గ్రామంలో నాయకులు సేకరించిన సంతకాలను వినుకొండ వైసిపి కార్యాలయానికి పంపించి, గవర్నర్‌కు సమర్పించడానికి సిద్ధం చేయాలన్నారు.

ప్రమాణ స్వీకారోత్స కార్యక్రమం

ప్రజాశక్తి - వినుకొండ

విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంగ్ ఏపీ రాష్ట్ర నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఏర్పాటు చేశారు. వినుకొండ ప్రాంతం నుండి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా రామావత్, ఏడుకొండలు నాయక్, బాణావత్, రాము నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రమాణ స్వీకారం అనంతరం రాష్ట్రస్థాయి కమిటీలు అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షులు బాణావత్. చక్రి నాయక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ జటావత్. రాంబాబు నాయక్ మాట్లాడుతూ వినకొండ నియో జకవర్గ ఏబిఎస్ఎస్ కమిటీ వారికి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలోని బంజారా జాతి (సుగాలి) సమస్యలపై జాతి ఐకమత్యంపై కృషి చేస్తామని తెలియజేశారు.

విద్యుత్ అదాలత్‌కు విశేష స్పందన

ప్రజాశక్తి - మాచర్ల


అదాలత్‌లో ఫిర్యాదులు స్వీరిస్తున్న అధికారులు

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం పట్టణంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విద్యుత్ వినియోగదారుల అదాలత్‌కు విశేష స్పందన లభించింది. ఈ సదస్సులో మొత్తం 35 సమస్యలు నమోదు అయ్యాయి. ఏపీసీపీడీసీఎల్, విజయవాడకు చెందిన సీజీఆర్‌ఎఫ్ ఛైర్‌పర్సన్ ఎన్. విక్టర్ ఇమ్మానుయేల్ సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. వినియోగ దారులు తమ కరెంటు బిల్లుల, లోవోల్టేజీ, కొత్త కనెక్షన్లు, ఇతర సమస్యలను నేరుగా అధికారులకు విన్నవించారు. అధికారులు స్వీకరించిన 35ఫిర్యాదుల్లో 8 సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన 27 సమస్యలు ఎక్కువగా విద్యుత్‌లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పు (షిఫ్టింగ్)కు సంబంధించినవిగా గుర్తించారు. ఆర్థిక సభ్యులు ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు, పల్నాడు జిల్లా పర్యవేక్షక అధికారి డాక్టర్ పి. విజయకుమార్, సీనియర్ ఎకౌంట్స్ ఆఫీసర్ బి. వెంకటేశ్వర రావు, మాచర్ల డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్. సింగయ్య, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ రామయ్య, ఇంజనీర్స్, అసిస్టెంట్ ఇంజనీర్స్, ఓఅండ్‌ఎంసిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైసిపి నాయకులు, కార్యకర్తలు

మద్యం విధానానికి వ్యతిరేకంగా వైసిపి ర్యాలీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నకిలీ మద్యం తయారీ పరిశ్రమ స్థాపించి రాష్ట్ర వ్యాప్తంగా సరఫరా చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడడం, ప్రభుత్వ మద్యం విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు పోరాడాలని వైసిపి పల్నాడు జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం నరసరావుపేటలో కల్తీ మద్యం, యూరియా అధిక ధరలు విక్రయానికి వ్యతిరేకంగా వైసిపి ఆధ్వర్యంలో వైసిపి జిల్లా కార్యాలయం నుంచి ప్రకాష్ నగర్‌లోని ఎక్సైజ్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఎక్సైజ్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి అధికారులకు వినతిపత్రం అందజేశారు. డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ నకిలీ మద్యం గుట్టు పూర్తిగా తేల్చేందుకు మద్యం దుకాణాలు, పర్మిట్ రూమ్లు, బార్లు, బెల్టు షాపుల్లో ఎక్సైజ్ శాఖ విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. తక్షణమే సీబీఐ దర్యాప్తు చేపట్టాలన్నారు. రాష్ట్రంలో 70వేలకు పైగా మద్యం గొలుసు దుకాణాలు ఏర్పాటయ్యాయని కల్తీ మద్యం ద్వారా అక్రమంగా అర్జించిన రూ48 వేల కోట్లలో 30శాతం ప్రభుత్వ పెద్దలకు వాటాలున్నాయని ఆరోపించారు. టిడిపి నాయకుడు జయచంద్ర రెడ్డి వైసిపి కోవర్టయితే తంబళ్లపల్లి టిడిపి టికెట్ ఎందుకు ఇచ్చారని ప్రశ్నించారు. ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తక్షణమే రాజీనామా చేసి నిష్పాక్షిగా దర్యాప్తుకు సహకరించాలని డిమాండ్ చేశారు. ఈ వైసిపి నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

కల్తీమద్యంపై మాట్లాడే హక్కు వైసిపికి లేదు : యాగంటి

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

కల్తీమద్యంపై మాట్లాడే హక్కు వైసిపికి లేదని మాచర్ల మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ యాగంటి మల్లికార్జునరావు అన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలోనే నకిలీ మద్యం దందా మొదలైందని, రాష్ట్రంలో ఉన్న అన్ని జిల్లాల్లో నకిలీ మద్యం వ్యవస్థలు ఏర్పాటు చేసుకున్నారని ఆరోపించారు. దేశంలో ఎక్కడా జరగని విధంగా లిక్కర్ స్కామ్‌కి పాల్పడ్డారని, డిజిటల్ పేమెంట్స్ తీసుకోకుండా వేల కోట్లు దోపిడీ చేశారని దుయ్యబట్టారు. నకిలీ మద్యం దందా బయటపడిన వెంటనే సీఎం చంద్రబాబు యాక్షన్ తీసుకున్నారని, ప్రస్తుతం సిట్ విచారణ జరుగుతోందని దీని ప్రమేయం వున్న ఎవ్వరినీ టిడిపి కూటమి ప్రభుత్వం వదిలిపెట్టదని పేర్కొన్నారు. నాయకులు తిక్క కొండలు, బొట్టు కోటేశ్వరారావు, దుబ్బాకల ప్రసాద్ రావు, రఫీ,స్వామి, పిన్నంశెట్టి కృష్ణ, శ్యామరాజు పురం బుజ్జి,మస్తాన్, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

మ్యూజికల్ ఛైర్స్ పోటీలు

ప్రజాశక్తి - పెదకూరపాడు

అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు మ్యూజికల్ ఛైర్స్ పోటీలు మంగళవారం నిర్వహించారు. మండలంలోని తాళ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, పాటిబండ్ల హైస్కూల్లో పోటీలు జరిగాయి. గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నీటి ట్యాంకర్లకు బిల్లులు మంజూరు చేయండి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఈ ఏడాది వేసవిలో ట్యాకర్ల ద్వారా నీరు సరఫరా చేసి బొల్లాపల్లి మండల ప్రజల దాహార్తి తీర్చిన వారికి బిల్లులు మంజూరు చేసి ఆదుకోవాలని ఏపి గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.కోటానాయక్ కోరారు.ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కోటా నాయక్ మాట్లాడుతూ బొల్లాపల్లి మండలంలో సాధారణంగానే 1000 అడుగులు బోర్లు వేసినా నీరు దొరకని పరిస్థితి ఉందని వేసవిలో బొల్లాపల్లి వాసుల బాధ వర్ణనాతీతమన్నారు. ఆ పరిస్థితులలో ఈ ఏడాది ఫిబ్రవరి 5 నెలల పాటు ట్యాంకర్ల ద్వారా పంచాయతీ అధికారులు నీరు సరఫరా చేశారన్నారు. బిల్లు మంజూరులో రాజకీయ నాయకుల ప్రమేయంతో బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో పిడిఎం నాయకులు వై.వెంకటేశ్వరరావు ఉన్నారు.

నిత్యావసరాలు అందజేత

ప్రజాశక్తి-ఈపూరు

ప్రతి ఒక్కరు సేవాభావం కలిగి ఉండాలని అరుంధతి సేవ ఫౌండేషన్ అధ్యక్షులు దాసరి కోటేశ్వరరావు అన్నారు. మండలంలోని ఊడిజర్ల గ్రామ ఎస్సీ కాలనీలో వంగల వీరయ్య,పున్నమ్మ వృద్ధ దంపతులకు 50 కేజీల బియ్యం, నిత్యవసర సరుకులు ఫౌండేషన్ ఆధ్వర్యంలో పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. దాసరి కోటేశ్వర రావు మాట్లాడుతూ నిరుపేదలకు ఆపన్న హస్తం అందించడమే లక్ష్యంగా సేవా ఫౌండేషన్ ద్వారా 15 సంవత్సరాలుగా వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఫౌండేషన్ సెక్రటరీ కట్టెంపూడి బర్న, జాయింట్ సెక్రెటరీ శిఖారామయ్య, మోషే, కాకాని బ్రహ్మనాయుడు, రామస్వామి పాల్గొన్నారు.

కొటనెమలి పురిలో కార్డన్ సెర్చ్

ప్రజాశక్తి - రాజుపాలెం

కోటనెమలి పూరి గ్రామంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానాస్పద ఇళ్ళల్లో తనిఖీ చేసి సరైన పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం గ్రామ బొడ్రాయి సెంటర్‌లో గ్రామ ప్రజలను ఉద్దేశించి పోలీసులు మాట్లాడుతూ ప్రశాంత వాతావరణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎవరైనా ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా చట్టపరమైన చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డిఎస్పీ, సిఐలు, ఎస్సైలు, కానిస్టేబుల్ పాల్గొన్నారు.



మానసకు ల్యాప్‌టాప్ అందజేస్తున్న కిరణ్, తదితరులు

బీటెక్ విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేత

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న ఎంటిఎంసీ పరిధిలోని గుండిమెడ గ్రామానికి చెందిన సిద్దెల మానస అనే విద్యార్థినికి టిడిపి తాడేపల్లి మండల మాజీ అధ్యక్షులు కొమ్మారెడ్డి కిరణ్ రూ.75 వేల ల్యాప్‌టాప్‌ను మంగళవారం ఉదయం అందజేశారు. ఈ సందర్భంగా కొమ్మారెడ్డి కిరణ్ మాట్లాడుతూ చదు వుపై ఆసక్తి కలిగి, కష్టపడి చదువుతున్న మానసకు ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో ఈ ల్యాప్‌టాప్ అందజేశానని అన్నారు. తనకు అడిగిన వెంటనే ల్యాప్‌టాప్ సహాయం చేసిన మంత్రి నారా లోకేష్, కొమ్మారెడ్డి కిరణ్‌కు విద్యార్థిని ధన్యవాదాలు తెలి పింది. ఏపీఐఐసీ డైరెక్టర్ మంగళగిరి నియో జకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు కనికళ్ళ చిరంజీవి, టిడిపి గ్రామ అధ్యక్షులు చిగురుపాటి సుబ్బారావు, టిడిపి తాడేపల్లి మండల నాయకులు గుండిమెడ రమేష్ బాబు, టిడిపి గ్రామ ప్రధాన కార్యదర్శి ఎన్. రాంబాబు, నాయకులు అనుమాలు వీరాంజనేయ ప్రసాద్, సాంబశివరావు, పాములు, కిషోర్, సంతోష్, ఎం.బాబురావు, శ్యామ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రతి మహిళ పారిశ్రామికవేత్తగా ఎదగాలి

ప్రజాశక్తి - పెదకాకాని

ప్రతి మహిళ ప్రభుత్వ పథకాలను అందిపుచ్చుకొని పారిశ్రామికవేత్తగా ఎదగాలని పెదకాకాని మండల అభి వృద్ధి అధికారి ఆర్.శ్రీనివాసరావు అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం సూక్ష్మ చిన్న, మధ్యతరగతి పరిశ్రమల ఆధ్వర్యంలో మహిళల అభ్యున్నతి కోసం ఆర్ఏఎంపి అవగాహన సదస్సును నిర్వహించారు. ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్ కె.నాగేంద్రబాబు మాట్లాడుతూ మహిళలు మరింత అభివృద్ధి చెందటానికి కేంద్ర ప్రభుత్వం ఉద్యమం స్కీమును అందుబాటులోకి తెచ్చిందనీ, దీనిలో రిజిస్ట్రేషన్ చేసుకుంటే వ్యాపార కార్యకలాపాలను బట్టి సబ్సిడీ తో కూడిన రుణాలు బ్యాంకర్లు అందిస్తారు అన్నారు.కార్యక్రమంలో డ్వాక్రా ఎపిఎం రాజు యానిమేటర్లు మహిళ పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వేస్ట్ రీసైక్లింగ్ ప్రాజెక్టుకు శ్రీకారం

ప్రజాశక్తి - దుగ్గిరాల

మండల కేంద్రం దుగ్గిరాలలో రూ.16 లక్షలతో ప్లాస్టిక్ వేస్ట్ రీసైక్లింగ్ ప్రాజెక్ట్ ఏర్పాటు చేయనున్నట్లు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి అర్జున్ రావు తెలిపారు. మంగళవారం ఆయన అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బందితో కలిసి స్థానిక చెత్త తయారీ కేంద్రం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం పారిశుధ్యానికి ప్రాధాన్యత నిస్తున్న క్రమంలో ప్లాస్టిక్, వేస్ట్ నుండి ఏ విధంగా సంపద తయారు చేయాలనేది మార్గదర్శకాలు రూపొందించిందని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో ఒక యూనిట్ ఏర్పాటు చేస్తా రని పైలెట్ ప్రాజెక్టు కింద రాష్ట్రంలోని 160 నియోజక వర్గాల్లో రూ.33 కోట్లతో ఫస్ట్ ఫేస్ కింద 210 యూనిట్లు నెలకొల్పనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయ డిప్యూటీ ఎంపీడీవో వెంకటేశ్వర్లు డిఎల్పిఓ స్వరూపరాణి, ఎంపీడీవో ఈ శ్రీనివాసరావు, సర్పంచ్ బాణావత్ ఖుషి భాయ్, కార్య దర్శి కె వివేకానంద, స్వచ్ఛంద కార్పొరేషన్ ఈఈ ఎం నారాయణస్వామి, డిఈ సతీష్, స్థానిక నాయకులు జి.వెంకట్రావు, వి.శ్రీకష్ణప్రసాద్, బి. వెంకటేశ్వర నాయక, ఎన్.చిరంజీవి, పాల్గొన్నారు.

రెండు సెంట్లు ఇళ్ల స్థలమివ్వాలి

ప్రజాశక్తి - తాడేపల్లి

ఎన్నో ఏళ్ల నుండి అద్దె ఇళ్లలోనే గడుపుతున్నామని, ఇప్పటికైనా మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు రెండు సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలని రాజధాని ముఖ ద్వారమైన ఉండవల్లి సెంటర్, బాపనయ్య నగర్ వాసులు కోరుతున్నారు. మంగళవారం ఆ ప్రాంతాల్లో సిపిఎం నాయకులు అర్హులైన పేదలతో ఇంటి స్థలం కోసం అర్జీలు పూర్తిచేసి అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీ మంగళగిరిలోనే ఎంటీఎంసీ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో బాధితులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కె.రామకృష్ణ, ఎస్ వెంకట్ నారాయణ, టి భక్తి రెడ్డి, ఎస్ ఇమ్మానియేల్ రాజు పాల్గొన్నారు.

పాఠశాల బస్సులకు టెండర్

ఆందోళనలో విద్యాసంస్థల నిర్వాహకులు

ప్రజాశక్తి- తాడేపల్లి

ఇటీవల కేంద్ర ప్రభుత్వం జిఎస్టి తగ్గించిన సందర్భంగా ఈనెల 16వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం కర్నూలులో భారీ బహిరంగ సభ నిర్వహిస్తోంది. ఇందుకు ప్రధాని నరేంద్ర మోడీని ఆహ్వానించారు. ఈ సందర్భంగా జరిగే సభలో పిఎంతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పాల్గొననున్నారు. ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చిందన్నట్లు జీఎస్టీ తగ్గింపు సభ వల్ల ఉమ్మడి జిల్లాలోని ప్రైవేటు పాఠశాలలతో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల ప్రైవేటు పాఠశాలలకు ఇబ్బంది వచ్చిపడింది. ప్రభుత్వం చెప్పేదానికి, క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితులకి బోలెడంత తేడా ఉన్నట్లు వాస్తవ నివేదికలు చెబుతున్నాయి. సభ నిర్వహణ ప్రజాప్రయో జనం కోసం కాకుండా, తమ రాజకీయ ప్రచార ప్రయోజనాల కోసం నిర్వహిస్తున్నట్లు విమర్శలు వినవస్తున్నాయి. అందులో భాగంగానే జిల్లా నుండి 400 ప్రైవేట్ పాఠశాలలకు చెందిన బస్సులు కర్నూలు తరలి వెళ్లాలని డీఈవో ఆదేశం జారీ చేశారు. రాష్ట్రం మొత్తం మీద నాలుగు వేల బస్సులు కర్నూలుకు తరలించడానికి వివిధ జిల్లాల విద్యాశాఖ అధికారులు ఎంఈఓల ద్వారా మెండిట్ విధించారు. బస్సులు అక్కడికి వెళ్లిన తర్వాత అక్కడ అధికారులు నిర్ణయించిన గ్రామాలకు వెళ్లి, జనాన్ని ఎక్కించుకొని సభా ప్రాంగణం దగ్గర దిగబెట్టాల్సి ఉంటుంది. సభ ముగిసిన తర్వాత తిరిగి వారి వారి గమ్యస్థానాలకు చేర్చాలి. ఈ కార్యక్రమమంతా సవ్యంగా జరగాలంటే నాలుగు రోజులు పాటు పాఠశాలలకు సెలవులు ఇవ్వాల్సి ఉంటుంది. విద్యా సంవత్సరంలో ఇప్పటికే పండుగలు, ఇతర సందర్భాలకు సులవులన్నీ హరించుకుపోయాయని విద్య సంస్థల నిర్వాహకులు చెబుతున్నారు. కొన్ని వందల కిలోమీటర్లు ఈ ప్రాంతాల నుండి బస్సులు ఖాళీగా వెళ్లి, అక్కడ పని ముగించుకుని మరల ఖాళీగా రావడానికి పెట్రోల్ కోసం రూ.లక్ష ఖర్చు పెట్టాల్సి వస్తుందని వాపోతున్నారు. దూర ప్రాంత మైన జిల్లాల నుండి వెళ్లే డ్రైవర్లు నాలుగు రోజులు పాటు ఎలా ఉండాలని వాపోతున్నారు. పైగా కర్నూల్ జిల్లాలో తమకు అనుభవం లేని రూట్‌లో డ్రైవింగ్ చేయటమంటే కష్టంతో కూడుకున్న పని అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోజుల్లో పాఠశాలకు వచ్చే పిల్లల పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు మాత్రం అదంతా మాకు తెలియదు, పైనుండి మాకు ఆదేశాలు అందాయి, అంటూ మండల విద్యాశాఖ అధికారులకు మీ మండలం నుండి ఇన్ని బస్సులు పంపించాలంటూ టార్గెట్ విధిస్తున్నారు. ఆ మండ లంలో ఉన్న పాఠశాల లిస్టును కూడా కిందకు పంపి తప్పని సరిగా పాఠశాలకు 10 బస్సులు తగ్గకుండా పంపించాలని అల్టిమేషన్ జారీ చేస్తున్నారు. ఈనెల 16వతేదీ పీఎం, సీఎం, డిప్యూటీ సీఎం పాల్గొని జిఎస్టి తగ్గింపు ర్యాలీకి ఆ జిల్లాలోని పాఠశాలల బస్సులు వినియోగిస్తే, మంచిదనే అభిప్రాయం ఆ ప్రాంతంలోని పాఠశాల నుండి వినవస్తోంది. జీఎస్టీ తగ్గింపు సంగతేమోగాని, కొత్తగా ఈ బాదుడు ఏంటని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంపై డిఇఓను సంప్రదించడానికి ప్రయత్నించగా వారు అందుబాటులోకి రాలేదు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రాంప్రసాద్





కృతిమ చేతులు బిగించిన వారితో రోటరీ క్లబ్ ప్రతినిధులు

14 నుంచి కృత్రిమ చేతుల పంపిణీ

ప్రజాశక్తి మంగళగిరి

మంగళగిరి వీటిజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కాలేజీలోని మురుగుడు హనుమంతరావు కళా ప్రాంగణంలో రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ఆధ్వర్యంలో మంగళకరం అనే పేరుతో ఈనెల 14 నుండి 17 వరకు జరిగే నాలుగో విడత దివ్యాంగులకు కృత్రిమ చేతుల పంపిణీ కార్యక్రమం మంగళవారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా రోటరీ 3150 డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ ఎస్ వీ రాంప్రసాద్ హాజరై కృత్రిమ చేతుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సభకు రోటరీ క్లబ్ మంగళగిరి అధ్యక్షులు ప్రగడ రాజశేఖర్ అధ్యక్షత వహించారు. సభనుద్దేశించి రాం ప్రసాద్ మాట్లాడారు. నాలుగు విడతలుగా సుమారు 900 దివ్యాంగులకు కృత్రిమ చేతులు పంపిణీ చేయడం సంతో షంగా ఉందన్నారు. రోటరీ డీజీఈ ఉదయ్ సుధీర్‌ఫిలాని మాట్లాడుతూ రోటరీ చేపట్టే ప్రాజెక్టులు సమాజానికి, ఆయా ప్రాంతాల ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉండాలన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి అధ్యక్షులు రాజశేఖర్ మాట్లాడుతూ దేశంలోనే మొదటిసారిగా జర్మనీ నుండి దిగుమతి చేసుకున్న అత్యాధునికమైన కృత్రిమ చేతులను పంపిణీ చేస్తున్నామన్నారు. ఒక్కో చేయి విలువ రూ.60 వేల వరకు ఉంటుందన్నారు. కార్యక్రమంలో రోటరీ పీడీజీ అన్నే రత్న ప్రభాకర్, రోటరీ క్లబ్ ఆఫ్ అమరావతి అధ్యక్షులు డీవీ నరసిం హం, ఆంధ్ర నాటక కళా సమితి అధ్యక్షులు నన్నప నేని నాగేశ్వరరావు, రోటరీ అసి స్టెంట్ గవర్నర్ ఈ పూర్ణచంద్, రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి కార్యదర్శి పారేపల్లి నిరంజన్ గుప్తా, ట్రెజరర్ కేవీఎస్ ప్రకాశరావు, ప్రాజెక్టు చైర్మన్ ఇసు నూరి అనిల్ చక్రవర్తి, ఇమీడియట్ పాస్ట్ ప్రెసిడెంట్ గాజుల శ్రీనివాసరావు, రోటరీ ప్రతి నిధులు రేవంత్‌కుమార్, అందే మురళీమోహనరావు, వడ్ల మూడి శ్రీనివాసరావు, కన్నెగంటి వెంకటేశ్వరరావు, చనుమోలుగోపాల్, వుడతా శ్రీనివాస రావు, డోగిపర్తి శ్రీనివాసరావు, కాపరౌతు సుందరయ్య, అవ్వారు శ్రీనివాసరావు పాల్గొన్నారు.





బాధితులకు చెక్కును అందజేస్తున్న టిడిపి నాయకులు

సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి- తాడేపల్లి

అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరికికి వైద్యఖర్చుల కోసం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన సిఎంఆర్ఎఫ్ చెక్కులను ఐటి, ఎలక్ట్రానిక్స్,విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో టీడీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు మంగళవారం అందచేశారు. 2వవార్డుకి చెందిన శ్యామల శ్రీనివాస్ రెడ్డికి రూ.లక్షా, 40వేల, 217 లను, 8వ వార్డుకి చెందిన నల్లపుబాబు రూ.లక్షా, 75వేల 879ల చెక్కును వెంకట్రావు అందచేశారు. సీఎం సహాయ నిధి చెక్కులు మంజూరు చేయించిన మంత్రి నారా లోకేష్‌కి బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. కార్య క్రమంలో టీడీపీ 2వార్డు అధ్యక్షులు కోగంటి వెంకటేశ్వర రావు, దొంతిరెడ్డి సాంబిరెడ్డి, కళ్ళం బాపిరెడ్డి, మేకా పుల్లా రెడ్డి, మండవ గోపాలరావు, అద్దంకి మురళి, జి.నాగేశ్వరరావు. పి.శ్రీనివాసరావు, షేక్ నాగుల్‌మీరా రావుల శిరీషరెడ్డి, రామారావు, సంపత్, విజయ్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఎంటిఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం గ్రామంలో అనారోగ్య బాధ్యతలకు సీఎం సహాయనిధి చెక్కులను గ్రామానికి చెందిన టిడిపి నాయకులు బాధితుల ఇంటి వద్దకు వెళ్లి అందజేశారు. కంచర్ల కోటేశ్వరరావుకు రూ.43,953 లు, మద్దినేని సుధారాణికి రూ.51,310లు, చావలి ప్రభావతికి రూ.30,100లు, తుమ్మలచెరువు శ్రీలక్ష్మికి రూ.55వేలు చెక్కులను అందజేశారు. లబ్ధిదారులు ముఖ్యమంత్రికి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి వడ్డేశ్వరం గ్రామ అధ్యక్షులు ఈపూరి బాబు, టిడిపి గ్రామ ప్రధాన కార్యదర్శి మద్దినేని సుబ్రమణ్యం, నాయకులు చావలి సురేష్, షేక్ నాగూర్‌వలి, ఇమాంస, కామినేని సాంబశివరావు, జనసేన నాయకులు సాయి పాల్గొన్నారు.



దీక్షల్లో కూర్చున్న ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు

315వ రోజుకు కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి

తమకు రావలసిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు మంగళవారం నాటికి315 రోజుకు చేరుకున్నాయి. దీక్షలను కార్మిక నాయకులు కే ఆదినారాయణ, తుపాకుల నాగేశ్వరావు, సిహెచ్. పిచ్చయ్య, వై సాంబశివరావు ప్రారంభించారు. దీక్షల్లో వై రమాదేవి, ఈశారమ్మా, వి రిబ్కా, టీదుర్గాభవాని, వి కాసమ్మ కూర్చున్నారు. కార్యక్రమంలో వై సుబ్బారావు, హగ్గయ్య, శివకుమారి, డి బేబీమ్మ పాల్గొన్నారు.

టిడ్కో సముదాయం వద్ద వాటర్ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి - మంగళగిరి

రాష్ట్ర ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో దివీస్ లాబొరేటరీస్ సహకారంతో మంగళగిరి పట్టణం టిడ్కో గృహసముదాయం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన రెండవ రక్షిత మంచినీటి ప్లాంట్లను మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో స్థానిక నాయకులు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ దివీస్ లాబొరేటరీస్ లిమిటెడ్ వారి ఆర్థిక సహకారంతో మంగళగిరి నియోజకవర్గ వ్యాప్తంగా 30కి పైగా మంచినీటి ప్లాంట్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఒక్కొక్క ప్లాంట్ రూ 16 లక్షల వ్యయంతో అత్యధునాతన మంచి నీటి ప్లాంట్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో టీటీడీ సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, స్వచ్ఛాంధ్ర మిషన్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆరుద్ర భూలక్ష్మి, మంగళగిరి పట్టణ అధ్యక్షులు పడవల మహేష్, పట్టణ ఉపాధ్యక్షురాలు వాసాపద్మ, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు పాల్గొన్నారు.



సిపిఆర్ గురించి వివరిస్తున్న ఎయిమ్స్ వైద్యులు

సిపిఆర్‌పై అవగాహన

ప్రజాశక్తి- తాడేపల్లి

ప్రమాదాలు సంభవించినప్పుడు రోగికి మెదడు, గుండె ఇతర ముఖ్యమైన అవయవాలకు రక్తప్రసరణ ఆగిన సందర్భంలో అత్యవసర పరిస్థితుల్లో ఆక్సిజన్ అవయవాలకు సరఫరా చేయుటకు గాను సిపిఆర్ అనగా కార్డియో పల్మనరీ రీససిటేషన్ ప్రక్రియ ద్వారా రోగిని కాపాడవచ్చుని, ఎయిమ్స్ నుండి వచ్చిన ప్రముఖ డాక్టర్లు అనంత ప్రకాష్ (సీనియర్ సిఎఫ్ఎం) విగ్నేష్ జూనియర్ (సిఎఫ్ఎం) నర్సింగ్ ఆఫీసర్ రవి, వివేక్, విక్రమ్, కష్ణ అవగాహన కల్పించారు. ఈనెల 17వ తేదీ వరకు అన్ని ప్రభుత్వ ఆసుపత్రిలో వారోత్సవాలు నిర్వహించాలని ప్రభుత్వం ఇచ్చిన పిలుపుమేరకు మంగళవారం ప్రకాష్ నగర్‌లోని, డ్రైవర్స్ కాలనీయు పిహెచ్‌సి నందు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎయిమ్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక ఉర్దూ స్కూల్ విద్యార్థినీ విద్యార్థులతో పాటు హాస్పిటల్ సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నిడమర్రు యుపిహెచ్‌సి వైద్యులు డాక్టర్ పి.హర్షవర్ధన్, సూపర్వైజర్ శ్రీలక్ష్మి, ఉర్దూ స్కూల్ ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు షాజీర్, సమియుల్లా, హాస్ప టల్ సిబ్బంది పాల్గొన్నారు అనంతరం డాక్టర్ మానసమంజరి ప్రజలు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించి సిపిఆర్ ఆవశ్యకతను వివరించారు.

నేటి నుండి బిఎస్ఎన్ఎల్ దీపావళి ఆఫర్లు

ప్రజాశక్తి గుంటూరు జిల్లా ప్రతినిధి

దీపావళి సందర్భంగా అక్టోబర్ 15 నుండి నెల రోజుల పాటు ప్రత్యేక బోనాంజా ఆఫర్లు ఇస్తున్నట్టు బిఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ ఎస్.శ్రీధర్ తెలిపారు. కేవలం రూ.1 తో 30 రోజుల వ్యాలిడిటి, అపరిమిత కాలింగ్, రోజుకి 2 జిబి డేటా, రోజుకు 100 మెసేజిలు ఉచిత సింకార్డు ఇవ్వబడుతుందన్నారు. ఎం.యన్.పి. వినియోగదారులకు కూడా ఈ ఆఫర్ వర్తిస్తుందన్నారు. అందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. సిమ్ కార్డు కావలసిన వారు దగ్గర లోని బి.యస్.యన్.యల్ సేవా కేంద్రాన్ని సంప్రదించాలని మంగళవారం ఒక ప్రకటనలో కోరారు.

పారదర్శకంగా ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి-గుంటూరు

ధాన్యం కొనుగోలు పూర్తి పారదర్శకతతో చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. ధాన్యం సేకరణపై కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పూర్తి పారదర్శకతతో, సమయపాలనతో, రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోళ్లు జరగాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో గోనెసంచులు అందుబాటులో లేకపోవడం, రవాణాలో ఆలస్యం, చెల్లింపుల్లో జాప్యం, నాణ్యతపై వివాదాలు వంటి అంశాలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సాంకేతిక సహాయకులకు, ధాన్యం కొనుగోలు, నాణ్యత పరీక్షలపై సరైన శిక్షణ ఇవ్వాలని, వారు రైతులకు సక్రమమైన మార్గదర్శకత అందించేలా చూడాలని సూచించారు. ధాన్యం నాణ్యత పరీక్షలలో నిర్లక్ష్యం లేకుండా ఖచ్చితంగా పరీక్షలు జరిపి, కేంద్రాల్లో స్వీకరించే ధాన్యం నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చూడాలని సూచించారు. సంబంధిత విభాగాల మధ్య సమన్వయం కలిగి, సివిల్ సప్లైస్, మార్కెటింగ్, వ్యవసాయ, సహకార, రవాణా శాఖలు పరస్పర సహకారంతో ధాన్యం కొనుగోలు కార్యకలాపాలు సాఫీగా కొనసాగించాలన్నారు. సమావేశంలో సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్ కే.తులసి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ధాన్యం కొనుగోలు ప్రక్రియను వివరించారు.

హిందూ పార్మసీ విద్యార్థులకు బహుళ జాతి సంస్థల్లో ఉద్యోగాలు

ప్రజాశక్తి-గుంటూరు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

స్థానిక అమరావతి రోడ్డు లోని హిందూ ఫార్మసీ కళాశాల ఎం.ఫార్మసీ విద్యార్థులు బహుళ జాతి ఔషధ సంస్థలలో ఉపాధి పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవి. నాగభూషణం తెలిపారు. వై. లక్ష్మిప్రియ 2022లో తమ కళాశాలలో ఎం.ఫార్మసీ చదివి ప్రస్తుతం ప్రముఖ ఔషధ సంస్థ ఈలి-లిల్లీలో రెగ్యులేటరీ విభాగంలో రెగ్యులేటరీ అసోసియేట్ గా పనిచేస్తుందన్నారు.లంకపల్లి మెర్సీ ఇవాంజిలిన్ ఫ్రాన్స్ దేశంలో పారిస్ నగరంలోని రెస్యు బయోటెక్నాలజీ సంస్థలో రెగ్యులేటరీ అసోసియేట్ ఉపాధి పొంది నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన సమావేశంలో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, సెక్రెటరీ డాక్టర్ ఎస్.మధుసూదనరావు, అధ్యాపకులు వారికీ అభినందనలు తెలియచేశారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించండి

పల్నాడు జిల్లా వ్యవసాయ అధికారి ఎం.జగ్గారావు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



నకిలీ విత్తనాలను అరికట్టడంలో విత్తన డీలర్ల సహకారం అవసరమని. నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎం.జగ్గారావు హెచ్చరించారు. మంగళవారం జిల్లా వ్యవసాయ శాఖ కార్యాల యంలో నరసరావుపేట మండలం లోని విత్తన డీలర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జగ్గారావు మాట్లాడుతూ విత్తన రైతాంగానికి నాణ్యతతో కూడిన విత్తనాలు అమ్మడం ద్వారా రైతులు నష్టపోకుండా ఉంటారన్నారు. రైతులు నకిలీ విత్తనాల బారిన పడకుండా డీలర్లు సహకరించాలన్నారు. విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. రబీ సీజన్ కావడం వలన ప్రస్తుతం అవసరం ఉన్న మొక్కజొన్న విత్తనాల లభ్యతపై డీలర్లను అడిగి తెలుసుకున్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి విత్తన స్టాక్ రిపోర్టు అందజేయాలని, రైతుకు ఇచ్చే బిల్లు మీద తప్పనిసరిగా లాట్ నెంబర్ వేయాలని అన్నారు.దుకాణంలో విత్తన నిల్వలు, పరిమాణం, ధరల బోర్డు ప్రదర్శించాలన్నారు. విత్తన చట్టానికి లోబడి ప్రతి డీలరు వ్యాపారం నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏడిఏలు వి. హనుమంతరావు, కె.వి శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి ఐ. శాంతి, నరసరావుపేట మండల విత్తన డీలర్లు పాల్గొన్నారు.

అనధికార వ్యాపారులు స్వచ్ఛదంగా ఖాళీ చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు : ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ ఉత్తర్వుల మేరకు అనధికార హోల్ సేల్ కూరగాయల వ్యాపారాలు చేస్తున్న అనుమతిలేని అన్నపూర్ణ కాంప్లెక్స్‌లోని వ్యాపారులు స్వచ్చందంగా బుధవారం ఉదయానికి ఖాళీ చేయాలని, లేకుంటే కోర్టు ఉత్తర్వుల మేరకు జిఎంసి అధికారులు సీజ్ చేస్తారని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. మంగళవారం కమిషనర్ తన ఛాంబరలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. కొల్లి శారదా హోల్ సేల్ మార్కెట్‌లో మాత్రమే రైతులు తమ కూరగాయలను విక్రయించుకోవడానికి అను మతులు ఉన్నాయని, అనుమతులు లేకుండా జాతీయ రహదారి సర్వీస్ రహదారిలో, అనుమతులు లేని అన్నపూర్ణ కాంప్లెక్స్‌లో వ్యాపారాలు చట్టవ్యతిరేకమని చెప్పారు. కొల్లిశారదా మార్కెట్‌కు నిర్వహించిన బహిరంగ వేలంలో షాపులు పొందని వారు అనధికారికంగా జాతీయ రహదారి వెంబడి వ్యాపారాలు నిర్వహిస్తున్నారన్నారు. వారు నిర్వహిస్తున్న ఖాళీ స్థలానికి రూ.3 కోట్లకుపైగా పన్ను బకాయి ఉందని, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ లేదని, నివాస అనుమతి ఉన్న అన్నపూర్ణ కాంప్లెక్స్‌లో వ్యాపారాలు చేస్తున్నారని తెలిపారు. సదరు కాంప్లెక్స్ నిర్వాహకులకు ఇప్పటికే చట్ట ప్రకారం నోటీసులు జారీ చేశామని, వారు కోర్టుకు వెళ్లగా ఈనెల 10వ తేదీలోగా కాంప్లెక్స్‌ను ఖాళీ చేయాలని ఉత్తర్వులు జారీ చేసిందని, కాంప్లెక్స్ నిర్వాపకులు కోర్టు అనుమతి ఇవ్వలేదన్నారు. కావున తక్షణం ఖాళీ చేయాలన్నారు.

అలసత్వం వహిస్తే క్రిమినల్ చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నీటి సరఫరా వ్యవస్థలో నిర్లక్ష్యం వహించే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. జిల్లాలో తాగునీటి వసతులు, సరఫరాపై కలెక్టర్ కార్యాలయంలో ప్రజారోగ్య శాఖ, గ్రామీణ నీటి సరఫరా, వైద్య ఆరోగ్య శాఖ, సంక్షేమ శాఖల అధికారులతో మంగళవారం కలెక్టర్ సమీక్షించారు.కలెక్టర్ మాట్లాడుతూ తాగునీటి సరఫరా, పర్యవే క్షణలో అత్యంత జాగ్రత్తగా ఉండాలన్నారు. వివిధ దశలలో నిర్దేశిత సమయంలో చేపట్టాల్సిన పరీక్షలు నిర్వహించకపోయినా, పైప్‌లైన్లు నిర్వహణలో నిర్లక్ష్యం వహించినా ప్రజారోగ్యం పట్ల తీవ్ర ప్రభావం పడుతోం దన్నారు. అధికారులు, సిబ్బంది తమ అనుభవంతో ప్రజలకు మంచి జరిగేలా అన్నిచర్యలు తీసుకోవాలని సూచిం చారు. ఇక మీదట ఎక్కడా ఎటువంటి సంఘట నలు రాకూడదని స్పష్టం చేశారు. తాగునీటి నమూనాలు సేకరించినప్పుడు ఎక్కడ నుంచి సేకరించింది స్పష్టంగా వివరాలు పొందుపర చాలన్నారు. తాగునీటి నమూనాల సేకరణ, వాటి పరీక్షలు, ఫలితాలు, ఇతర నివేదికలు నిర్దేశిత కాలంలో చేయాలని ఆదేశించారు. వాటికి ఎస్ఓపి ఉంటే వాటిని పాటించాల్సిం దేనని స్పష్టం చేశారు. తాగునీటి సరఫరాపై దష్టి సారించడం వలన చాలా వరకు ఆరోగ్య సమస్యలు నివారించ గలమని చెప్పారు. ఎంఎల్ హెచ్‌పిలు వారి పరిధిలో ఉన్న వసతిగహాల వద్ద తాగునీటి సరఫరా, వసతుల నమూనాలు సేకరించి నీటి పరీక్షలు నిర్వహించాలని సూచిం చారు. ప్రజారోగ్య శాఖ పర్యవేక్షక ఇంజనీర్ డి.శ్రీని వాస్, ఆర్.డబ్ల్యూఎస్ పర్యవేక్షక ఇంజనీర్ కె.కళ్యాణచక్రవర్తి తమ విభాగాల్లో చేపడుతున్న నీటినమూనాల సేకరణ, పరీక్షలు తదితర అంశాలను వివరించారు. వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ సంచాలకులు శోభారాణి మాట్లాడు తూ గతేడాది తెనాలి మండలం కొలకలరు గ్రామం ఎస్సీ కాలానికి నేరుగా నీటి పథకంకు ఎక్కించిన నీటిని సరఫరా చేయడం జరిగిందని, నీటి పథకం పాచిపట్టి ఉండటం వలన సంఘటన జరిగిందని వివరించారు. నిర్దేశిత సమయంలో మార్గదర్శకాలకు అనుగు ణంగా పర్యవేక్షణలో లోపాలు నివారించాల్సిన అవ సరం ఉందని చెప్పారు.సమావేశంలో డిఎం హెచ్ఓ డాక్టర్ కె.విజయలక్ష్మి, డిపిఓ బి.వి.నాగ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

19న త్రిపురనేని రామస్వామి చౌదరి పురస్కార సభ

ప్రజాశక్తి-గుంటూరు



కరపత్రం ఆవిష్కరిస్తున్న కెఎస్ లక్ష్మణరావు తదితరులు

సామాజిక విప్లవకారుడు కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి పురస్కార సభ ఈనెల 19న గుంటూరు, బ్రాడీపేట 2/6లోని యుటిఎఫ్ సమావేశ మందిరంలో సాయంత్రం 5 గంటలకు నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు తెలిపారు. సభకు సంబంధించిన ఆహ్వాన పత్రాలను కెఎస్ లక్ష్మణరావు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ తెలుగు నాట అంధ విశ్వాసాలు, మూఢ నమ్మకాలతో కునారిల్లుతున్న తెలుగు సమాజాన్ని కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి రచనలు, హేతువాద ఉద్యమంతో సామాజిక విప్లవాన్ని తీసుకొచ్చారని కొనియాడారు. 2025వ సంవత్స రానికి త్రిపురనేని రామస్వామి చౌదరిపు రస్కారాలను సుప్రసిద్ధ కవి, సాహితీ విమర్శకులు డాక్టర్ కోయి కోటేశ్వరరావు, రాజకీయ, సామాజిక ఉద్యమకారుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లుకు ఇస్తున్నట్లు ప్రకటించారు. ఈ సభకు ముఖ్య వక్తలుగా ప్రముఖ సాహితీ విమర్శకులు, కవి, జి.లక్ష్మీనరసయ్య, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమాజీ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి.వి.రమేష్, నరసరావుపేట ఎంపి లావు శ్రీకృష్ణదేవ రాయలు, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, టీటీడీ బోర్డు సభ్యులు జంగా కృష్ణమూర్తి, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో కార్యక్రమంలో డాక్టర్ మూకిరి సుధ, కైలా జయసుధ, బి.విల్సన్ పాల్గొన్నారు.

మహిళా గ్రీవెన్స్ ప్రారంభం

ప్రజాశక్తి గుంటూరు జిల్లా ప్రతినిధి



గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలో మహిళల నుంచి ప్రత్యేకంగా ప్రతి మంగళవారం విజ్ఞాపన స్వీకరించే కార్యక్రమానికి ఎమ్మెల్యే గళ్ళా మాధవి శ్రీకారం చుట్టారు. వివిధ సమస్యలపై మహిళల కోసం ప్రత్యేకంగా "మహిళా గ్రీవెన్స్ డే" ప్రారంభించినట్లు ఆమె మీడియాకి తెలిపారు. నియోజకవర్గ ప్రజల కోసం త్వరలో ప్రత్యేక యాప్ అందుబాటులోకి తీసుకొని రానున్నట్లు ప్రకటించారు. మహిళల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. మహిళలతో స్వేచ్ఛగా మాట్లాడి, వెంటనే పరిష్కారం పొందే అవకాశం ఉందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. ప్రతి వారం సంబంధిత శాఖాధికారులను ఆహ్వానించి, ఫాస్ట్ ట్రాక్ పరిష్కార విధానంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆమె పేర్కొన్నారు. "ఇది కేవలం వినే కార్యక్రమం కాదని, సమస్య పరిష్కారం జరిగే వరకు మహిళలతో పాటు నిలిచే వ్యవస్థగా తీర్చిదిద్దుతామని తెలిపారు.

250 సెల్‌ఫోన్‌లు అప్పగింత

ప్రజాశక్తి గుంటూరు జిల్లా ప్రతినిధి



జిల్లాలోని ప్రాంతాల్లో చోరీకి గురైన 250 సెల్ ఫోన్లు జిల్లా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్.పి. వకుల్ జిందాల్ మంగళవారం ఏర్పాటు చేస్తే విలేకరుల సమావేశంలో ఎందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. సెల్ ఫోన్లు విలువ సుమారు రూ.50 లక్షలు ఉంటుందన్నారు. సెల్ ఫోన్ పోయిన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. గత 2 సంవత్సరాల్లో 3414 సెల్ ఫోన్లు రికవరీ చేసామన్నారు. వీటి విలువ 6 కోట్ల 80 లక్షల ఉంటుందన్నారు. సెల్ ఫోన్లు చోరీ చేసి కొందరు నేరాలకు పాల్పడుతున్నారని ఎవరైనా, ఎప్పటికైనా దొరికిపోతారన్నారు. సెల్ ఫోన్ పోయిన వెంటనే నెంబర్ ను డియాక్టివేట్ చేయాలన్నారు. సైబర్ నేరాల పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.ఐటీ కోర్ సీఐ నిషార్ భాష , హెడ్ కానిస్టేబుల్ కిషోర్, కానిస్టేబుళ్ళు శ్రీధర్, ఇమామ్ సాహెబ్, యాసిన్, అరుణ, మానసను, సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ రమేష్, కానిస్టేబుల్ కరీముల్లాను ఎస్.పి. అభినందించినారు.

సైబర్ నేరగాళ్ల వలలో పడొద్దు

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న సిఐ వెంకటేశ్వర్లు

స్థానిక టిజెపిఎస్ కాలేజిలో మంగళవారం ఎన్‌సిసి విభాగం ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్ నివారణ గురించి అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టాభిపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ జి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సైబర్ క్రైమ్ గురించి అవగాహన కలిగి ఉండాలని, గుర్తు తెలియని నంబర్ల నుండి వివిధ రకాల మెస్సేజ్‌లు వచ్చినా, లాటరీ గెలుచుకున్నారని వివిధ రకాల లింకులు వచ్చినా, మీకు తక్కువ వడ్డీకి లోన్లు ఇస్తామని మన ఆధార్, రేషన్ కార్డ్, పాన్‌కార్డ్ పంపించండి అని చెప్పినా వాళ్ళు సైబర్ నేరగాళ్లుగా గుర్తించి వెంటనే అప్రమత్తం అవ్వాలన్నారు. అంతే కాకుండా డిజిటల్ అరెస్ట్ అంటూ మిమ్మల్ని ఎవరైనా కాల్స్‌చేసి బెదిరించినా మీరు బయపడకుండా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని చెప్పారు. వేగంగా మారుతున్న కాలంలో సైబర్ క్రైమ్‌లు కూడా వేగంగా జరుగుతున్నాయన్నారు. అందరూ జాగ్రత్తగా, ధైర్యంగా, తెలివిగా ఉండాలని చెప్పారు. ఈకార్యక్రమంలో ఎస్ఐ రామాంజనేయులు, ప్రిన్సిపాల్, డాక్టర్ బివిహెచ్. కామేశ్వరశాస్త్రి, కళాశాల ఎన్‌సిసి అధికారి మేజర్ పి.కుమార్‌రాజా పాల్గొన్నారు.